E KABURU - Digital News Paper　E-PAPER


# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 05-03-2026 (వారం) గురువారం సంపుటి: 02 || సంచిక:62 || పేజీలు–6

www.ekaburu.com




....(మిగతా2లో)

## మోదీ ఇజ్రాయెల్ ను వీడిన 48 గంటల తర్వాత ఇరాన్‌పై దాడి

- ఇజ్రాయెల్ రాయబారి
- మోదీ ఇజ్రాయెల్ నుంచి వెళ్లిపోయాక దాడికి అవకాశం వచ్చిందన్న రాయబారి
- మోదీ పర్యటనలో దేశాభివృద్ధి గురించి మాత్రమే చర్చించినట్లు వెల్లడి
- యుద్ధం గురించి ఆయనతో చర్చించలేదని స్పష్టీకరణ



....(మిగతా2లో)

## మార్చి 8న అసెంబ్లీలో భారీ మార్పులు



- మార్చి 8న నూతన కౌన్సిల్ హాల్ ప్రారంభం
- అసెంబ్లీ ప్రాంగణంలో 'తెలంగాణ తల్లి' విగ్రహ ఆవిష్కరణ
- సీఎం, మండలి చైర్మన్ కొత్త ఛాంబర్లకు శ్రీకారం
- ఒకే ప్రాంగణంలో బడ్జెట్ సమావేశాలు – పాలనలో సులభతరం

**ఈ కబురు ;** తెలంగాణ రాష్ట్ర శాసనసభ ప్రాంగణం మరో చారిత్రాత్మక ఘట్టానికి వేదిక కానుంది. అసెంబ్లీ ప్రాంగణ అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా మార్చి 8వ తేదీన నూతనంగా నిర్మించిన కౌన్సిల్ హాల్‌ను ప్రారంభించనున్నారు. కౌన్సిల్ హాల్ ప్రారంభోత్సవం జరిగే అదే రోజున (మార్చి 8) అసెంబ్లీ ప్రాంగణంలో 'తెలంగాణ తల్లి' విగ్రహాన్ని కూడా అత్యంత ప్రతిష్టాత్మకంగా ఆవిష్కరించనున్నారు.

....(మిగతా2లో)

## డిజిటల్ జనగణనకు తెలంగాణ సిద్ధం

### .. మే 11 నుంచి తొలి దశ



- తెలంగాణలో జనగణన తొలి దశకు రంగం సిద్ధం
- మే 11 నుంచి జూన్ 9 వరకు ఇళ్ల వివరాల సేకరణ
- దేశంలోనే తొలిసారిగా పూర్తి డిజిటల్ విధానంలో లెక్కింపు
- సొంతంగా వివరాలు నమోదు చేసుకునేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్
- ఏ ఒక్క ఇల్లు వదలకుండా పక్కాగా లెక్కించాలని అధికారులకు ఆదేశాలు

**ఈ కబురు ;** దేశవ్యాప్తంగా జరగనున్న జాతీయ జనాభా గణన (జనగణన) ప్రక్రియలో భాగంగా తెలంగాణలో తొలి దశ పనులను పకడ్బందీగా నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా మే 11 నుంచి జూన్ 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లు, ఇతర కట్టడాల వివరాలను నమోదు చేసే కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో జిల్లా కలెక్టర్లు, అన్ని శాఖల కార్యదర్శులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, కీలక మార్గదర్శకాలు జారీ చేశారు.

**దేశంలోనే తొలిసారి డిజిటల్ లెక్కింపు**

ఈసారి జనగణన ప్రక్రియలో ఒక చారిత్రాత్మక మార్పు చోటుచేసుకోనుంది. దేశ చరిత్రలోనే మొదటిసారి జనాభా లెక్కలను పూర్తిస్థాయి డిజిటల్ విధానంలో చేపట్టనున్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది ప్రత్యేక మొబైల్ అప్లికేషన్ ద్వారా నేరుగా స్మార్ట్‌ఫోన్లలో వివరాలను నమోదు చేస్తారు. ఇది సమాచార సేకరణలో వేగాన్ని, కచ్చితత్వాన్ని పెంచుతుంది. అంతేకాకుండా, పౌరులు తమ వివరాలను తామే స్వయంగా నమోదు చేసుకునేందుకు "సెల్ఫ్‌ఎన్యూమరేషన్" పేరిట ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను కూడా అందుబాటులోకి తేనున్నారు. ఈ ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ మే 11కి 15 రోజుల ముందు నుంచే ప్రారంభమవుతుందని సీఎస్ రామకృష్ణారావు తెలిపారు.

....(మిగతా2లో)

## ముగిసిన మావోయిజం..!



**ఈ కబురు, హైదరాబాద్ ;**
భారతదేశంలో దశాబ్దాల పాటు సాగిన సాయుధ విప్లవ పోరాటం ఒక ముగింపు దశకు చేరుకున్నట్లు కనిపిస్తోంది. మావోయిస్టు పార్టీ అగ్రనేత, మాజీ ప్రధాన కార్యదర్శి ముప్పాల లక్ష్మణరావు అలియాస్ గణపతి లొంగిపోవడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలంగాణ పోలీస్ వర్గాలు ధ్రువీకరిస్తున్నాయి. ఇటీవలే మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్జీ పోలీసులకు లొంగిపోయారు. ఆయన ఇచ్చిన సమాచారం ఆధారంగా గణపతి ఆచూకీని పోలీసులు కనుగొన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం గణపతి అడవుల్లో లేరని, ఏదో ఒక నగరంలో షెల్టర్ తీసుకుని ఉండొచ్చని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ఇదివరకే వెల్లడించారు.

....(మిగతా2లో)



తెలంగాణ కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థులు ఖరారు ....(3లో)



క్షిపణి నిల్వలు తగ్గుతున్న వేళ..
ఎమర్జెన్సీ మీటింగ్‌కు సిద్ధమైన ట్రంప్ ....(3లో)



తెలంగాణ వర్సిటీలో విద్యార్థుల మధ్య ఘర్షణ
.. పలువురికి గాయాలు ....(3లో)



ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఎవరు ఎంపికైనా నిర్మూలిస్తాం: ఇజ్రాయెల్ ప్రకటన ....(3లో)

## నిప్పుతో చెలగాటం వద్దు

### .. వేసవిలో అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి; రంగనాథ్



**ఈ కబురు, హైదరాబాద్ ;**
హైదరాబాద్ నగరం బాచుపల్లి ప్రధాన రహదారిలో మంగళవారం రాత్రి జరిగిన భారీ అగ్నిప్రమాద స్థలాన్ని బుధవారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. మంటల్లో కాలి బూడిదైన ఫర్నీచర్ దుకాణాలను స్వయంగా చూసిన ఆయన.. ప్రమాదం జరిగిన తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్ జరగడం వల్లే నిప్పు రవ్వలు ఎగిసిపడి దుకాణాలకు అంటుకున్నాయని నిర్వాహకులు కమిషనర్‌కు వివరించారు. ....(మిగతా2లో)




## సింగూరు డ్యామ్ సేఫ్టీ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

**ఈ కబురు, హైదరాబాద్ :**
రాష్ట్ర సచివాలయంలో భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అధ్యక్షతన సింగూరు ప్రాజెక్టు డ్యాం సేఫ్టీ పై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, మైనింగ్, ఉపాధి కల్పన శాఖ, మెదక్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, ఇరిగేషన్ శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఈ. శ్రీధర్, ఇరిగేషన్ శాఖ ముఖ్య అధికారులు, ఈ ఎన్ సీ లు , ఇంజనీరింగ్ శాఖ ముఖ్య అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన సింగూరు డ్యాం సేఫ్టీ పై రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ ఉత్తమ్ కుమార్ రెడ్డి వివేక్ వెంకట స్వామిలు చర్చించారు. డ్యామ్ సేఫ్టీ ప్రభుత్వానికి ఎంతో ప్రాధాన్యత అంశం అన్నారు

....(మిగతా2లో)

## పతాక స్థాయికి చేరిన మహా యుద్ధం



- మారణహోమం లో 800 మంది మృతి
- ఇరాన్ భద్రత స్థావరాలపై, రెవల్యూషన్ గార్డ్స్ పై వైమానిక దాడులు
- పొరుగు దేశాలకు వ్యాపిస్తున్న యుద్ధ ఛాయలు

ఈ కబురు ; మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరుకున్నాయి. బుధవారం నాటి తాజా నివేదికల ప్రకారం, ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న ఈ మహా యుద్ధం ఐదో రోజుకు చేరుకుంది. ఇరాన్ రాజధాని టెహ్రాన్, ఇజ్రాయెల్‌లోని యెరూషలేం నగరాలు వరుస పేలుళ్లతో దద్దరిల్లాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికల మధ్య జరుగుతున్న ఈ హింసాత్మక ఘర్షణల్లో ఇరాన్‌లో ఇప్పటివరకు సుమారు 800 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐ డి ఎఫ్ ) ఇరాన్ భద్రతా స్థావరాలు, రివొల్యూషనరీ గార్డ్స్ భవనాలపై ఖచ్చితత్వంతో కూడిన వైమానిక దాడులు చేస్తోంది. ఈ యుద్ధం ఇప్పుడు కేవలం ఇరాన్, ఇజ్రాయెల్‌లకే పరిమితం కాకుండా పొరుగు దేశాలకూ వేగంగా వ్యాపిస్తోంది. దక్షిణ లెబనాన్‌లోని హిజ్బుల్లాకు చెందిన 60కి పైగా క్షిపణి లాంచర్లు, ఆయుధ డిపోలను ఇజ్రాయెల్ దళాలు ధ్వంసం చేశాయి.

....(మిగతా3లో)

## ఇవి మనిషి సృష్టించిన తీవ్ర విషాదాలు: కేటీఆర్

- ఇరాన్‌లోని పాఠశాలపై మిస్సైల్ దాడిలో 165 మంది విద్యార్థినులు మృతి
- తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన కేటీఆర్
- ఈ యుద్ధాలు రాబోయే తరాలకు తీరని శోకాన్ని మిగిలిస్తాయని వ్యాఖ్య



....(మిగతా2లో)

## ఐఏఎస్, ఐపీఎస్‌లను బెదిరిస్తున్నారు

### .. ముఖ్యమంత్రిపై హరీశ్ రావు సంచలన ఆరోపణలు

- ముఖ్యమంత్రికి పరిపాలన చేయడం రావడం లేదని విమర్శ
- ఐపీఎస్, ఐఏఎస్‌లను పదేపదే బదిలీ చేస్తున్నారన్న హరీశ్ రావు
- రెండున్నరేళ్లలో ఐదుసార్లు భారీ ఎత్తున బదిలీ చేశారన్న హరీశ్ రావు



....(మిగతా2లో)

## సీఎం పదవికి నీతీశ్ కుమార్ రాజీనామా చేయనున్నారా?

ఈ కబురు , పట్నా:
బిహార్ ముఖ్యమంత్రి, జేడీయూ అధ్యక్షుడు నీతీశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయనున్నారా..? ఇదే విషయం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.



....(మిగతా3లో)

## ఈ ఏడాది ఎండ తీవ్రత ఎక్కువే..!



**ఈ కబురు, హైదరాబాద్:** ఉత్తర తెలంగాణలో ఈ ఏడాది ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది గరిష్ఠ ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయని తెలిపింది. ఇప్పటికే రాష్ట్రంలో 33 నుంచి 39 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని.. రాగల రెండు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు రెండు నుంచి నాలుగు డిగ్రీల మేర పెరుగుతాయని పేర్కొంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.

## మోదీ ఇజ్రాయెల్ ను వీడిన
# 48 గంటల తర్వాత ఇరాన్‌పై దాడి

ఈ కబురు ; ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇజ్రాయెల్ పర్యటన అనంతరం ఇరాన్‌పై దాడులు జరగడంపై సర్వత్రా చర్చ సాగుతోంది. ఫిబ్రవరి 25, 26 తేదీలలో మోదీ రెండు రోజుల పాటు పర్యటించారు. మోదీ పర్యటన ముగిసిన రెండు రోజుల తర్వాత అంటే ఫిబ్రవరి 28న ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేసింది. ఈ దాడుల గురించి మోదీకి తెలుసని ఇలా వివిధ రకాల ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో భారత్‌లో ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజర్ స్పందించారు. ఇరాన్‌పై దాడికి, మోదీ పర్యటనకు సంబంధం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇరాన్‌పై దాడి ఒక ఆపరేషనల్ అవకాశమని అన్నారు. ప్రధాని మోదీ ఇజ్రాయెల్ నుంచి వెళ్లిపోయాక ఆ అవకాశం వచ్చిందని తెలిపారు. మోదీ ఇజ్రాయెల్ పర్యటనలో దేశాభివృద్ధి గురించి మాత్రమే చర్చించామని, యుద్ధం గురించి ఆయనతో చర్చించలేదని స్పష్టం చేశారు. ఆ సమయానికి దాడులు చేస్తామనే విషయం మాకు కూడా తెలియదని అన్నారు. మోదీ వెళ్లిపోయాక ఇరాన్‌పై దాడి గురించి నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇరాన్‌పై దాడులకు ఫిబ్రవరి 28న ఉదయం సెక్యూరిటీ కేబినెట్ ఆమోదం తెలిపిందని వెల్లడించారు. ఆ తర్వాతే దాడులు ప్రారంభమయ్యాయని అన్నారు. ఈ దాడులకు సంబంధించి చాలాకాలం ముందు నుంచి అమెరికాతో సంప్రదింపులు జరుపుతున్నామని వెల్లడించారు. సరైన సమయం కోసం వేచి చూస్తున్నామని, అది ఇప్పుడు కుదిరిందని రూవెన్ అజర్ తెలిపారు.



## మార్చి 8న అసెంబ్లీలో భారీ మార్పులు



రాష్ట్ర అస్తిత్వానికి, గౌరవానికి చిహ్నంగా ఈ విగ్రహాన్ని అక్కడ ఏర్పాటు చేస్తున్నారు. నూతన కౌన్సిల్ హాల్‌తో పాటు, అదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి (CM) ఛాంబర్‌ను , శాసనమండలి చైర్మన్ ఛాంబర్‌ను కూడా ప్రభుత్వం అదే రోజున ప్రారంభించనుంది. దీనికి సంబంధించి ఏర్పాట్లు ఇప్పటికే తుది దశకు చేరుకున్నాయి. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం, ఈసారి జరగబోయే బడ్జెట్ సమావేశాలను ఒకే ప్రాంగణంలోని అసెంబ్లీ , నూతన కౌన్సిల్ హాల్‌లలో నిర్వహించనున్నారు. ఉభయ సభల సమావేశాలు ఒకే ప్రాంగణంలో జరగడం వల్ల పాలనాపరమైన పనులు మరింత సులభతరం కానున్నాయి.



# ముగిసిన మావోయిజం..!

తాజా సమాచారం ప్రకారం, గణపతి తన లొంగిబాటుకు సంబంధించి తెలంగాణ పోలీసులతో రాయబారం నడుపుతున్నట్లు సమాచారం. గణపతి నేపాల్ లేదా ఫిలిప్పీన్స్ వంటి దేశాల్లో తలదాచుకున్నట్లు గతంలో ప్రచారం జరిగింది. అయితే, ప్రస్తుతం ఆయన తీవ్ర అనారోగ్యం, వయోభారంతో బాధపడుతున్నారు. నడవలేని స్థితిలో ఉన్న ఆయన, తన శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. లొంగిబాటుకు సంబంధించి ఆయన ప్రభుత్వం ముందు కొన్ని షరతులు, డిమాండ్లు ఉంచినట్లు సమాచారం. 2004లో మావోయిస్టు పార్టీ ఆవిర్భవించిన నాటి నుండి 2018 నవంబర్ వరకు గణపతి ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. పార్టీలో అత్యున్నత స్థాయి వ్యూహకర్తగా పేరుగాంచిన ఆయన లొంగిపోతే, మావోయిస్టు ఉద్యమం దాదాపుగా అంతరించినట్లేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ కీలక పరిణామాల మధ్య తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. బుధవారం సాయంత్రం కేంద్ర హోంమంత్రి అమిత్ షా నివాసానికి చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి, ఆయనతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి, ఎస్ఐబి (SIB) ఐజీ సుమతి, ఇంటెలిజెన్స్ అదనపు డైరెక్టర్ విజయ్ కుమార్ కూడా పాల్గొన్నారు. రాష్ట్రంలో మావోయిస్టుల లొంగిబాటు, గణపతికి సంబంధించి ప్రభుత్వం తీసుకోబోయే నిర్ణయాలు, శాంతి భద్రతల అంశాలపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. గణపతి వంటి అగ్రనేత లొంగిబాటు అనేది కేవలం రాష్ట్రానికే కాకుండా దేశ భద్రతకు సంబంధించిన విషయం కావడంతో కేంద్ర హోంశాఖ కూడా దీనిపై నిశితంగా దృష్టి సారించింది. మావోయిస్టు అగ్రనేతలు ఒక్కొక్కరుగా ఎన్‌కౌంటర్లలో చనిపోవడం లేదా అనారోగ్యంతో లొంగిపోవడంతో పార్టీ క్యాడర్ ప్రస్తుతం కుదేలైంది. మల్లోజుల కోటేశ్వరరావు (కిషన్ జీ), నంబాల కేశవరావు (బసవరాజ్) వంటి కీలక నేతల తదుపరి వరుసలో ఇప్పుడు గణపతి మాత్రమే మిగిలి ఉన్నారు. ఆయన గనుక అధికారికంగా పోలీసులకు లొంగిపోతే, అడవిలో తుపాకీ గర్జనలు పూర్తిగా ఆగిపోయే అవకాశం ఉంది. గణపతి లొంగిబాటు ప్రక్రియ త్వరలోనే కొలిక్కి వచ్చే అవకాశం ఉందని, దీనిపై ప్రభుత్వం అధికారిక ప్రకటన చేసేందుకు ఏర్పాట్లు చేస్తోందని సమాచారం. ఈ పరిణామం తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో శాంతి స్థాపనకు పెద్ద ముందడుగుగా నిలవనుంది.

## డిజిటల్ జనగణనకు తెలంగాణ సిద్ధం ..మే 11 నుంచి తొలి దశ



--పక్కాగా వివరాలు నమోదు చేయాలి: సీఎస్

క్షేత్రస్థాయిలో వివరాల సేకరణలో ఎటువంటి పొరపాట్లకు ఆస్కారం ఉండకూడదని సీఎస్ స్పష్టంగా ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామం, మండలం భౌగోళిక సరిహద్దులను కచ్చితంగా నిర్ధారించుకోవాలని సూచించారు. మారుమూల గిరిజన తండాలు, పట్టణాల్లోని మురికివాడలతో సహా రాష్ట్రంలోని ఏ ఒక్క కట్టడాన్ని కూడా వదిలిపెట్టకుండా జాబితాలో చేర్చాలని ఆయన స్పష్టం చేశారు. ఈ బృహత్కార్యక్రమం విజయవంతం కావడానికి గణకులు, పర్యవేక్షకులకు నాణ్యమైన శిక్షణ ఇవ్వాలని కలెక్టర్లకు సూచించారు. ఈ సమావేశంలో పాల్గొన్న జనాభా లెక్కల విభాగం రాష్ట్ర సంచాలకురాలు భారతీ హోళికెరి, డేటా సేకరణ కోసం రూపొందించిన మొబైల్ యాప్ పనితీరు, సమాచార భద్రతకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ప్రతి ఒక్కరి బాధ్యతలను ఆమె విశదీకరించారు. ఈ డిజిటల్ విధానం వల్ల సమాచార సేకరణలో పారదర్శకత పెరగడంతో పాటు, భవిష్యత్ ప్రభుత్వ పథకాల రూపకల్పనకు కచ్చితమైన గణాంకాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

# నిప్పుతో చెలగాటం వద్దు



మరికొందరు దుకాణదారులు పైన వెళ్తున్న విద్యుత్ తీగ తెగి పడటం వల్ల ఈ ఘోరం జరిగిందని తెలిపారు. వేసవి కాలం మొదలైనందున చిన్న నిప్పు రవ్వ కూడా పెను ముప్పుగా మారుతుందని, అగ్నిప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా రంగనాథ్ సూచించారు. అగ్నిప్రమాదాల నివారణ అనేది కేవలం అధికారుల తనిఖీల వల్ల మాత్రమే సాధ్యం కాదని.. ప్రతి ఒక్కరూ సొంతంగా జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఫైర్ సేఫ్టీ నిబంధనలను పాటించినప్పుడే ఆస్తి.. ప్రాణ నష్టాలను అరికట్టవచ్చని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లు కష్టపడి సంపాదించుకున్న ఆస్తులు ఒక్క ప్రమాదంతో బూడిద కావడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బాచుపల్లి ఘటనలో ఒక్కో దుకాణంలో దాదాపు రూ. 25 లక్షలకు పైగా విలువైన ఫర్నిచర్ ఉందని.. మొత్తం 22 దుకాణాలు కాలిపోవడం వల్ల తీరని నష్టం వాటిల్లిందని ఆయన చెప్పారు. బాధిత వ్యాపారులకు నష్టపరిహారం అందించే విషయాన్ని రెవెన్యూ విభాగం చూస్తుందని కమిషనర్ తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకునేందుకు హైడ్రా సిద్ధమవుతోంది. ఫైర్ సేఫ్టీ నిబంధనలు పట్టించుకోని వారిపై చర్యలు తీసుకునే అధికారాన్ని కూడా హైడ్రాకు కట్టబెట్టాలని ప్రభుత్వానికి నివేదించినట్లు రంగనాథ్ వెల్లడించారు. ఈ ప్రమాద సమయంలో కొన్ని గ్యాస్ సిలిండర్లు కూడా పేలాయని.. జనసాంద్రత ఉన్న చోట ఇటువంటి అజాగ్రత్తలు ఉండకూడదని హెచ్చరించారు. ముఖ్యంగా వాణిజ్య సముదాయాలు.. గోదాముల్లో విద్యుత్ వైరింగ్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేయించుకోవాలని సూచించారు. అగ్నిప్రమాదం జరిగిన వెంటనే స్పందించేలా ఫైర్ ఎక్స్‌టింగ్యుషర్లు అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. వేసవి తీవ్రత పెరుగుతున్న కొద్దీ విద్యుత్ వినియోగం పెరిగి ట్రాన్స్‌ఫార్మర్లు.. ఎలక్ట్రికల్ ప్యానెళ్లపై భారం పడుతుంటుంది. ఇది షార్ట్ సర్క్యూట్‌లకు దారి తీసే అవకాశం ఉంది. కాబట్టి వ్యాపారులు.. నివాసితులు తమ పరిసరాల్లో ఉన్న విద్యుత్ వ్యవస్థల పట్ల జాగ్రత్తగా ఉండాలని హైడ్రా కమిషనర్ కోరారు. అగ్నిమాపక నిబంధనలను ఉల్లంఘించే భవనాలపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ప్రజల ప్రాణాలను.. ఆస్తులను రక్షించడమే హైడ్రా ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు.

## ఐఏఎస్, ఐపీఎస్‌లను బెదిరిస్తున్నారు ..ముఖ్యమంత్రిపై హరీశ్ రావు సంచలన ఆరోపణలు



**ఈ కబురు, హైదరాబాద్ ;**

**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐఏఎస్, ఐపీఎస్‌లను బెదిరిస్తున్నారంటూ బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. కలెక్టర్ల సదస్సులో ఆయన బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రికి పరిపాలన చేయడం రావడం లేదని విమర్శించారు. ఐఏఎస్, ఐపీఎస్‌లను పదేపదే బదిలీ చేస్తున్నారని మండిపడ్డారు. రెండున్నరేళ్లలోనే ఐదుసార్లు భారీ ఎత్తున అధికారులను బదిలీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తరచూ బదిలీలతో పాలన కుంటుపడుతోందని అన్నారు. పరిస్థితులను అర్థంచేసుకునే లోపే అధికారులను బదిలీ చేస్తున్నారని విమర్శించారు. జీహెచ్ఎంసీ కమిషనర్లు కూడా రెండున్నరేళ్లలో నలుగురు మారారని తెలిపారు. ముఖ్యమంత్రి లేదా మంత్రులకు నచ్చకపోతే ఆ అధికారులను వెంటనే బదిలీ చేస్తున్నారని ఆరోపించారు. కొందరికి పోస్టింగులు ఇచ్చి జాయిన్ చేసుకోవడం లేదని విమర్శించారు. త్వరలో కాంగ్రెస్ నేతల అవినీతిని, బినామీలను బయటపెడతామని హెచ్చరించారు.**

## ఇవి మనిషి సృష్టించిన తీవ్ర విషాదాలు: కేటీఆర్



ఈ కబురు ; ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా జరుపుతున్న దాడులు తీవ్రరూపం దాల్చాయి. దక్షిణ ఇరాన్‌లోని మినాబ్ పట్టణంలో ఉన్న 'షజ్రే తయ్యెబా' బాలికల ప్రాథమిక పాఠశాలపై జరిగిన మిస్సైల్ దాడిలో 165 మంది విద్యార్థినులు మరణించారన్న వార్త ప్రపంచవ్యాప్తంగా విషాదం కలిగించింది. ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల శిథిలాల కింద చిక్కుకుని మరణించిన ఆ 165 మంది బాలికల సామూహిక అంత్యక్రియలకు సంబంధించిన వీడియోలు, ఫొటోలను కేటీఆర్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. యుద్ధం వెనుక కారణాలు ఏవైనా, ఇలాంటి మారణహోమాలు మనిషి సృష్టించిన తీవ్ర విషాదాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యుద్ధాలు రాబోయే తరాలకు కేవలం తీరని శోకాన్ని, వినాశనాన్ని మాత్రమే మిగుల్చుతాయని కేటీఆర్ హెచ్చరించారు.

## సింగూరు డ్యామ్ సేఫ్టీ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి



నేషనల్ డ్యామ్ సెక్యూరిటీ సంస్థ రూపొందించిన నిబంధనల మేరకు సింగూర్ డ్యాం ను పరిరక్షించాలని మంత్రులు ఇరిగేషన్ శాఖ అధికారులకు ఆదేశించారు. సింగూరు డ్యామ్ సేఫ్టీ నిర్మాణ పనులపై టెక్నికల్ కమిటీని నియమించాలని మంత్రులు ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఆందోల్ నియోజకవర్గం లో 40 వేల ఎకరాలకు సాగునీరు అందించే పెద్దారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం డీపీఆర్ లను శరవేగంగా రూపొందించి ప్రభుత్వానికి అందజేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులను మంత్రులు ఆదేశించారు. పెద్దారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంను పనులకు ఉగాదిలోగా శంకుస్థాపన పనులకు శ్రీకారం చుట్టాలని మంత్రులు ఆదేశించారు. సింగూరు ప్రాజెక్టు కాలువల లైనింగ్ పనులను జూన్ 26 లోగా పూర్తి చేయాలని మంత్రులు ఆదేశించారు. సింగూర్ ప్రాజెక్టు సుందరీకరణ , పరిరక్షణ పనులను వెంటనే ప్రారంభించాలని మంత్రులు దామోదర్ రాజనర్సింహ ఉత్తంకుమార్ రెడ్డి వివేక్ వెంకటస్వామి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఆందోల్ నియోజకవర్గం లో చిన్న నీటి ప్రాజెక్టులైనా చెరువుల పునరుద్ధరణ పనుల టెండర్లను పూర్తి చేసి ఈ సీజన్లో రైతులకు సాగునీరు అందించాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ఇరిగేషన్ శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఈ శ్రీధర్, ఈఎన్సీలు రమేష్ బాబు, శ్రీనివాస్, టి.శ్రీనివాస్, సంగారెడ్డి జిల్లా ఇరిగేషన్ శాఖ SE బి రాజమ్మ, జాయింట్ సెక్రెటరీ శ్రీనివాస్, ఇన్చార్జి ఎస్సీ రఘునాథ్ రావు, ఈ ఈ బీమ్, DE నాగరాజ్, ఇరిగేషన్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# పతాక స్థాయికి చేరిన మహా యుద్ధం





దీనివల్ల లెబనాన్ రాజధాని బీరూట్ పరిసర ప్రాంతాల్లో పౌరులు ప్రాణాలు కాపాడుకోవడానికి వలస వెళ్తున్నారు. మరోవైపు ఇరాన్ మద్దతు ఉన్న ఉగ్రవాద ముఠాలు జోర్డాన్‌పై డ్రోన్ దాడులు చేయడంతో అక్కడ కూడా ప్రమాద సైరన్లు మోగుతున్నాయి.ఈ రాజకీయ గందరగోళం,దాడుల మధ్య ఇరాన్ అంతర్గత రాజకీయాల్లో పెను మార్పు చోటుచేసుకుంది. ఇటీవల అమెరికాఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన అత్యున్నత నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ వారసుడిగా ఆయన రెండో కుమారుడు ముజ్తబా ఖమేనీని ఇరాన్ కొత్త 'సుప్రీం లీడర్'గా 'అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్' ఎంపిక చేసింది. ముజ్తబాకు గతంలో ఎటువంటి అధికారిక ప్రభుత్వ పదవులు లేనప్పటికీ. ఇరాన్ పాలనా వర్గాల్లో ఆయనకు గట్టి పట్టు ఉంది. అయితే ఆయన నియామకంపై ఇజ్రాయెల్ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది.పశ్చిమాసియాలో మారుతున్న పరిస్థితుల దృష్ట్యా భారత ప్రభుత్వం తన పౌరుల రక్షణ కోసం ముందస్తు చర్యలు చేపట్టింది. గల్ఫ్ దేశాల్లో ఉన్న సుమారు ఒక కోటి మంది భారతీయుల భద్రతను పర్యవేక్షించడానికి విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ న్యూఢిల్లీలో ఒక ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. సహాయం కోసం టోల్‌ఫ్రీ నంబర్ 1800118797ను ప్రకటించింది. ఇప్పటికే టెహ్రాన్ నుంచి వందలాది మంది భారతీయ విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అలాగే యూఏఈలోని ఫుజైరాలో చిక్కుకున్న భారతీయులను తీసుకురావడానికి స్పైస్‌జెట్ 8 ప్రత్యేక విమానాలను నడుపుతోంది.ఈ అంతర్జాతీయ యుద్ధం భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపింది. ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 82 డాలర్ల మార్కును దాటాయి. దీనివల్ల బుధవారం భారత స్టాక్ మార్కెట్ భారీగా కుప్పకూలింది. సెన్సెక్స్ 1,758 పాయింట్లు పతనం కాగా నిఫ్టీ 530 పాయింట్లు నష్టపోయింది. రూపాయి విలువ కూడా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా డాలర్‌తో పోలిస్తే 92.18 వద్దకు పడిపోయింది. ఇది దేశంలో ద్రవ్యోల్బణం పెరగడానికి దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. యుద్ధం సృష్టించిన అస్థిరత కారణంగా వినోద రంగం కూడా ప్రభావితమైంది. కన్నడ సూపర్ స్టార్ యశ్ నటించిన ప్రతిష్ఠాత్మక పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' విడుదల వాయిదా పడింది. వాస్తవానికి మార్చి 19న విడుదల కావాల్సిన ఈ చిత్రం మధ్యప్రాచ్యంలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల వల్ల ఇప్పుడు జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుందని మేకర్స్ ప్రకటించారు. గ్లోబల్ మార్కెట్‌లో ఉన్న అనిశ్చితి వల్ల అనేక ఇతర భారీ ప్రాజెక్టులు కూడా వాయిదా పడే అవకాశం ఉంది. మరోవైపు ఇరాన్ ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో పాకిస్థాన్ డిఫెన్స్ మంత్రి అసిఫ్ ఖవాజా కీలక వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్, అఫ్గానిస్తాన్, భారత్ కలిసి పాకిస్థాన్ పై కుట్రలు చేస్తున్నాయని మండిపడ్డారు. పాకిస్థాన్ ను సామంత దేశంగా మార్చేందుకు ఈ దేశాలు ప్లాన్ చేస్తున్నాయని ఫైర్ అయ్యారు. ఇజ్రాయెల్ పెత్తనాన్ని పాకిస్థాన్ బోర్డర్ వరకూ తీసుకురావాలని కుట్రలు పన్నుతున్నట్లు కీలక ఆరోపణలు చేశారు.అమెరికాతో అణ్వాయుధ ఒప్పందానికి ఇరాన్ సిద్ధంగా ఉన్నా ఆ దేశంపై యుద్ధం చేస్తున్నారని పాకిస్థాన్ రక్షణ మంత్రి అసిఫ్ ఖవాజా మండిపడ్డారు. ఇజ్రాయెల్ ఆధిపత్యాన్ని పాకిస్థాన్ సరిహద్దుల వరకూ విస్తరించి పాకిస్థాన్ ను సామంత దేశంగా మార్చాలని ఈ దేశాలు కుట్రలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. అఫ్గానిస్తాన్ , భారత్ తో పాటు పాకిస్థాన్ కు సరిహద్దు దేశాలు కలిసి తమను టార్గెట్ చేస్తున్నాయని ఆరోపించారు.ఈ దేశాలు జాయింట్ సింగిల్ పాయింట్ ఎజెండాగా ముందుకు వెళ్తున్నాయని పాకిస్థాన్ సరిహద్దు చుట్టూ ఉద్రిక్త పరిస్థితులు నెలకొల్పి, బోర్డర్ చుట్టూ శత్రు దేశాలతో నింపి చివరకు పాకిస్థాన్ ను సామంత రాజ్యంగా మార్చేందుకు ప్లాన్ చేస్తున్నాయని ఖవాజా అన్నారు. ఈ మేరకు పాకిస్థాన్ ప్రజలకు కీలక పిలుపునిచ్చారు. పార్టీలు, రాజకీయాలు, మతాలకు అతీతంగా అందరూ ఏకమై ఈ కుట్రలను తిప్పికొట్టాలని ఖవాజా పిలుపునిచ్చారు.ప్రస్తుతం పాకిస్థాన్ అఫ్గానిస్తాన్ మధ్య దాడులు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత క్షీణించాయి. మరోవైపు భారత్ అఫ్గానిస్తాన్ మధ్య దౌత్య పరమైన సంబంధాలు బలోపేతం అవుతున్నాయి. ఇక పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ పాకిస్థాన్ మధ్య సంబంధాలు రద్దు అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ డిఫెన్స్ మంత్రి అసిఫ్ ఖవాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.శనివారం ప్రారంభమైన దాడుల్లో ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా సైన్యాలు క్షిపణులు, డ్రోన్ దాడులతో రెచ్చిపోయాయి. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మృతి చెందిన విషయం తెలిసిందే. దాంతో ఇరాన్ ప్రతీకార దాడులు చేస్తోంది. ఇజ్రాయెల్ తోపాటు గల్ఫ్ దేశాలపై దాడులకు పాల్పడుతోంది. యూఏఈ, కువైట్, ఖతార్, బహ్రెయిన్, సౌదీ అరేబియా, సైప్రస్, ఇరాక్, జోర్డాన్ తదితర దేశాలపై క్షిపణులు, డ్రోన్ల వర్షం కురిపిస్తోంది.

# సీఎం పదవికి నీతీశ్ కుమార్ రాజీనామా చేయనున్నారా?



ఆయన రాజ్యసభకు వెళ్లనున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. గురువారం ఆయన రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేయనున్నట్లు జాతీయమీడియా కథనాలు పేర్కొన్నాయి. జేడీయూ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు సంజయ్ ఝా బుధవారం దిల్లీ నుంచి పట్నాకు వచ్చి, నీతీశ్‌తో సుదీర్ఘంగా భేటీ అయ్యారు. అలాగే కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ (లలన్‌సింగ్) దిల్లీ నుంచి పట్నాకు వచ్చినట్లు తెలుస్తోంది. ఇవన్నీ ఈ వార్తలకు బలం చేకూరుస్తున్నాయి. మరోవైపు నీతీశ్ వారసుడు ఎవరనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఆయన కుమారుడు నిశాంత్ రాజకీయాల్లోకి రానున్నారని, త్వరలోనే ఈ నిర్ణయాన్ని జేడీయూ అధికారికంగా ప్రకటిస్తుందని రాష్ట్ర మంత్రి శ్రవణ్ కుమార్ ఇప్పటికే వెల్లడించారు. తన కుమారుడు రాజకీయాల్లోకి రావడాన్ని నీతీశ్ కూడా అంగీకరించారు. నిశాంత్‌కు డిప్యూటీ సీఎం పదవి కట్టబెట్టొచ్చని తెలుస్తోంది. బిహార్ అసెంబ్లీలో ఎన్డీయే కూటమి బలం 202గా ఉంది. ఒక రాజ్యసభ సీటు గెలవాలంటే 41 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉండాలి. ఆ లెక్కన నాలుగు నుంచి ఐదు ఎగువ సభ సీట్లు కూటమికి దక్కనున్నాయి.

# ఫ్యాక్షన్ రాజకీయాలకు ఫుల్ స్టాప్ పెట్టాల్సిందే

**–2004లో వైఎస్ సీఎం అయ్యాక రాష్ట్రంలో మారణహోమం**

**–తోట చంద్రయ్య కుటుంబానికి న్యాయం చేసేందుకే బిల్లు**

**–శాసనసభలో నియామకాల సవరణ బిల్లును ప్రతిపాదించిన మంత్రి లోకేష్**

**ఈ కబురు ,అమరావతి:**

పల్నాడులో బీసీ నాయకుడు తోట చంద్రయ్యను అతి కిరాతకంగా హతమార్చిన ఆనాటి విజువల్స్ ఏపీలోనే కాదు, భారతదేశంలోని చాలామంది ప్రజలు చూశారు. వీడియో రికార్డు కూడా ఉంది. అటువంటి చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని మేము నిర్ణయించాం. ఫ్యాక్షన్ రాజకీయాలకు ఫుల్ స్టాప్ పెట్టేందుకే ఈ బిల్లు తెస్తున్నామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఏపీ పబ్లిక్ సర్వీసు నియామకాల సవరణ బిల్లును మంత్రి లోకేష్ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఈ విషయమై కేవలం టీడీపీలోనే కాకుండా కూటమిలో ఉన్న జనసేన, బీజేపీ నాయకులతో కూడా చర్చించాం. కేబినెట్ లో కూడా పవనన్నతో మాట్లాడితే ఆయన ఇది మంచి నిర్ణయమని అన్నారు. ఫ్యాక్షన్ లో చనిపోయిన వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పిస్తే, వారి జోలికిరావడానికి ప్రత్యర్థులు భయపడతారని భావించి కేబినెట్ లో చర్చించి ఈ బిల్లు తీసుకువచ్చాం. కేబినెట్ ఆమోదం తెలిపింది. శాసనసభకు తీసుకువచ్చాం. 2025 సెప్టెంబర్ లో ఈ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. బీసీ బిడ్డకు ఉద్యోగం ఇవ్వాలని మేం కౌన్సిల్ కు బిల్లు పంపిస్తే కావాలని అక్కడ ముందుకు వెళ్లకుండా అడ్డుకున్నారు. బిల్లును వారు మండలిలో తిరస్కరించినా, నిబంధనలకు లోబడి మేం అసెంబ్లీలో పాస్ చేస్తామని చెప్పాం. కానీ, బిల్లుపై ఏ నిర్ణయం తీసుకోకుండా అక్కడ తొక్కిపట్టారు. దీంతో ఒక బాధ్యతగా భావించి మళ్లీ ఈ బిల్లు శాసనసభకు తీసుకొచ్చాం, దీనిని ఎవరూ ఆపలేరు. దీనిపై ముందుకు వెళ్లేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఒక్క తోట చంద్రయ్య కుటుంబానికే కాదు, ఏపీలో ఏ కుటుంబానికి ఈ విధంగా అన్యాయం జరగకూడదన్నదే మా లక్ష్యం. ఇది ఒక ఫేవర్, చారిటీ కాదు. ఇది మనందరి బాధ్యత. ఫ్యాక్షన్ కి ఫుల్ స్టాప్ పెట్టాలి. ఇలాంటి కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. అందుకే ఈ బిల్లును శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించాల్సిందిగా మంత్రి లోకేష్ సహచర శాసన సభ్యులకు విజ్ఞప్తి చేశారు. ఏ పార్టీకి చెందిన వారైనా ఫ్యాక్షన్ రాజకీయాలకు ఫుల్ స్టాప్ పెట్టాలి. ఫ్యాక్షన్ అంటే రాజకీయ హత్యలు. ఒక కుటుంబాన్ని ఆర్థికంగా దెబ్బతీసి, పెద్దదిక్కు లేకుండా చేసి యావత్ కుటుంబాలను రోడ్డుపైకి తేవడమే ఫ్యాక్షనిస్టుల ప్రధాన లక్ష్యం. 201924 నడుమ కూడా ఫ్యాక్షన్ దాడులు పెద్దఎత్తున కొనసాగాయి. బలహీనవర్గాలకు చెందిన బీసీ నాయకుడు, నమ్ముకున్న సిద్ధాంతం కోసం పోరాడిన తోట చంద్రయ్యను 2022 జనవరి 12న నడివీధిలో మెడపై కత్తితో నరికి దారుణంగా హతమార్చారు. హత్యచేసే సమయంలో వారి నాయకుడికి జై కొడితే వదిలేస్తామని ఒత్తిడి తెస్తే... నేను చచ్చిపోయినా ఫర్వాలేదు, పసుపుజెండా వదలనని చెప్పిన వ్యక్తి తోట చంద్రయ్య. ఆనాడు జై చంద్రబాబు, జై తెలుగుదేశం అన్నందుకు అతి కిరాతకం చంపేశారని మంత్రి లోకేష్ ఆవేదన వ్యక్తంచేశారు. అన్న ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యక నేను 1983లో జన్మించా. నాకు ఊహ వచ్చినప్పటి నుంచి నేను రాజకీయాలను క్లోజ్ గా గమనిస్తూ వచ్చా. అంతకుముందు ఫ్యాక్టన్ రాజకీయాలకు ఏపీ కేరాఫ్ అడ్రస్ గా ఉండేది. 1995లో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక ఏ పార్టీ అని చూడకుండా ఫ్యాక్షన్ రాజకీయాలకు ఫుల్ స్టాప్ పెట్టాలనే లక్ష్యంతో ఆనాడు యుద్ధం ప్రకటించారు. ఒక పక్క ఫ్యాక్షనిజం, మరోపక్క నక్సలిజంపై పోరాడారు. 2004లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మొదటి రెండు సంవత్సరాల్లో 164మంది టీడీపీ కార్యకర్తలను అతిదారుణంగా, కిరాతకంగా చంపేశారు. ప్రత్యేకంగా ఉమ్మడి అనంతపురంలో ఈ మారణాకాండ ఎక్కువగా జరిగింది. మా నాయకులు ఒకరువెళ్లి హత్యజరిగిన కుటుంబాన్ని పరామర్శించేలోపు మరో కుటుంబంలో హత్య జరిగిందని కబురు వచ్చేది.. అలా ఆనాడు హత్యల పరంపర కొనసాగింది. ఫ్యాక్షన్ బాధిత కుటుంబాలు మళ్లీ ఆ మార్గంలో వెళ్లకూడదనే ఉద్దేశంతో, వారి పిల్లల కోసం చంద్రబాబు హైదరాబాద్ లో ఎన్టీఆర్ మోడల్ స్కూలు ఏర్పాటుచేశారు. ఆ పిల్లలను సొంత పిల్లల మాదిరి ప్రత్యేక శ్రద్ధతో చదివించారు, మాకు కూడా అంత సమయం ఇవ్వలేదు. ఫ్యాక్షన్ దాడుల్లో చనిపోయిన వారి పిల్లలను పరామర్శించేందుకు నెలకు ఒకసారి స్కూలుకు వెళ్లి వారి బాగోగులు చూసుకునే వారు. వారికి కౌన్సిలింగ్ చేసి మీరు ఫ్యాక్షన్ లోకి వెళ్లవద్దని హితవు పలికారు. ఇటువంటి ప్రయత్నం భారతదేశంలో ఏ రాజకీయపార్టీ చేయలేదు, కేవలం ఒక తెలుగుదేశం మాత్రమే బాధ్యతగా ముందుకు తీసుకెళ్లిందని మంత్రి లోకేష్ చెప్పారు.

## లైక్స్ పిచ్చి ఎటు తీసుకెళ్తోంది? ..సోషల్ మీడియా స్టంట్లపై సీపీ సజ్జనార్ ఆగ్రహం

ఈ కబురు, హైదరాబాద్;

నేటి డిజిటల్ యుగంలో సోషల్ మీడియా క్రేజ్ యువతను పెడదోవ పట్టిస్తోంది. కేవలం కొన్ని లైక్స్, వ్యూస్ కోసం ప్రాణాలకు తెగించి ప్రమాదకరమైన స్టంట్లు చేయడం ఇప్పుడు ఒక ఫ్యాషన్ లా మారిపోయింది. ఈ ధోరణిపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ సోషల్ మీడియా వేదికగా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో పెరుగుతున్న ఈ 'లైక్స్ పిచ్చి' మనల్ని ఎటు తీసుకెళ్తోందని ఆయన ప్రశ్నించారు. సజ్జనార్ తన ట్వీట్‌లో యువతను ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. "లైక్స్ కోసం.. పాపులారిటీ కోసం ఎంతకైనా తెగిస్తారా? మీ పిచ్చి వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే, మీ వెనుక వచ్చే వాహనదారులకు ఆ ప్రమాదం కనిపించకపోతే, పోయే ప్రాణాలకు ఎవరు బాధ్యత వహిస్తారు?" అని ఆయన నిలదీశారు. రోడ్లు అనేవి మీ సోషల్ మీడియా స్టంట్లు ప్రదర్శించే స్టేజీలు కావని, అవి ప్రయాణాలకు మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. ఒక చిన్న పొరపాటు వల్ల అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా బైక్ స్టంట్లు, కదిలే వాహనాలపై రీల్స్ చేయడం వల్ల వంద ఏళ్ల జీవితం ఒక్క క్షణంలో ముగిసిపోతుందని సజ్జనార్ గుర్తు చేశారు. రోడ్డుపై చేసే విన్యాసాలు చూసేందుకు త్రిల్లింగ్‌గా ఉండవచ్చు కానీ, ప్రమాదం జరిగితే జీవితాంతం మంచానికే పరిమితం కావాల్సి వస్తుందని హెచ్చరించారు. "మీ గోల్డెన్ ఫ్యూచర్‌ను కొన్ని లైక్స్ కోసం నాశనం చేసుకోవద్దు. బాధ్యతాయుతంగా డ్రైవ్ చేయండి" అని ఆయన యువతకు హితవు పలికారు. ఇతరుల ప్రాణాలను ప్రమాదంలో నెట్టడం చట్టరీత్యా నేరమని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. సమాజంలో నైతిక విలువలు తగ్గిపోతున్నాయని, కేవలం వర్చువల్ ప్రపంచంలో గుర్తింపు కోసం వాస్తవ ప్రపంచంలో ప్రాణాలను పణంగా పెట్టడం విచారకరమని ఆయన అభిప్రాయపడ్డారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలని, వారి చేతికి వాహనాలు ఇచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు చెప్పాలని సూచించారు. రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అని సజ్జనార్ తన సందేశంలో పేర్కొన్నారు.



## తెలంగాణ కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థులు ఖరారు





**ఈ కబురు, హైదరాబాద్:**

తెలంగాణ నుంచి కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థులు ఖరారయ్యారు. వేం నరేందర్‌రెడ్డి, అభిషేక్ మను సింఘ్వి పేర్లను అధిష్ఠానం ఖరారు చేసింది. గురువారం వీరు నామినేషన్లు దాఖలు చేయనున్నారు. మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి, మాజీ ఎంపీ వీహెచ్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, వినయ్‌కుమార్, జెట్టి కుసుమకుమార్ తదితరుల పేర్లూ వినిపించినప్పటికీ.. సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పేరు ఖరారైంది. మహబూబాబాద్ జిల్లాకు చెందిన వేం నరేందర్‌రెడ్డి.. సీఎం రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా పేరుపొందారు. 2004 అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబాబాద్ నుంచి తెదేపా తరఫున పోటీ చేసి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2012లో జరిగిన ఉప ఎన్నికలో హనుమకొండ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2015లో ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసి పరాజయం చెందారు. అనంతరం రేవంత్‌రెడ్డితో పాటు వేం నరేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు.

## క్షిపణి నిల్వాలు తగ్గుతున్న వేళ.. ఎమర్జెన్సీ మీటింగ్‌కు సిద్ధమైన ట్రంప్



ఈ కబురు : ఇరాన్‌తో యుద్ధం వేళ అమెరికా వద్ద ఉన్న క్షిపణి, ఆయుధ నిల్వాలు తగ్గుతున్నట్లు తాజాగా పలు నివేదికలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎమర్జెన్సీ మీటింగ్‌కు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఆయుధ ఉత్పత్తిని త్వరిత గతిన పెంచే అంశంపై చర్చలు జరపడానికి రక్షణరంగ కాంట్రాక్టర్లను, ఇతర ఉన్నతాధికారులను అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌కు ఆహ్వానించినట్టు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. శుక్రవారం ట్రంప్ వారితో భేటీ కానున్నట్లు పేర్కొన్నాయి. ఇరాన్‌తో కొనసాగుతోన్న యుద్ధంలో భారీగా క్షిపణులను వినియోగించడంతో.. తగ్గిపోతున్న ఆయుధాగారాన్ని తిరిగి నింపడానికి అమెరికా రక్షణ శాఖ పెంటగాన్ చర్యలు తీసుకుంటున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఇందుకు పెద్ద మొత్తంలో ఖర్చయ్యే అవకాశం ఉందని అంచనా వేశాయి. 2022లో రష్యా ఉక్రెయిన్‌పై దాడి చేసినప్పటి నుంచి అగ్రరాజ్యం ఉక్రెయిన్‌కు భారీగా సైనిక సహాయం అందిస్తుండడంతో.. ఆ దేశం వద్ద ఉన్న నిల్వాలు తగ్గినట్టు తెలుస్తోంది. మరో 10 రోజులు ఇలాగే దాడులు కొనసాగిస్తే అవి పూర్తిగా తగ్గిపోయే ప్రమాదం ఉందని పెంటగాన్ పేర్కొన్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ క్రమంలోనే అమెరికా అధ్యక్షుడు ఎమర్జెన్సీ మీటింగ్‌కు సిద్ధమయ్యారు

## తెలంగాణ వర్సిటీలో విద్యార్థుల మధ్య ఘర్షణ ..పలువురికి గాయాలు



ఈ కబురు, భిక్కనూరు: తెలంగాణ విశ్వవిద్యాలయంలో విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం జంగంపల్లి శివారులో ఉన్న వర్సిటీ సౌత్ క్యాంపస్ వసతిగృహంలో మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. హోలీ సంబరాల అనంతరం సీనియర్, జూనియర్ విద్యార్థులు రెండు గ్రూపులుగా విడిపోయి పరస్పరం దాడులకు పాల్పడ్డారు. దీంతో పలువురికి గాయాలయ్యాయి. వర్సిటీ సిబ్బంది వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వసతిగృహం వద్దకు స్థానిక ఎస్సై ఆంజనేయులు, వార్డెన్ డాక్టర్ యాలాద్రి అక్కడికి చేరుకొని విద్యార్థులతో మాట్లాడారు. విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

## ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఎవరు ఎంపికైనా నిర్మూలిస్తాం: ఇజ్రాయెల్ ప్రకటన

ఈ కబురు ; ఇరాన్ తదుపరి సుప్రీం లీడర్‌గా ఎంపికయ్యే వ్యక్తిని కూడా నిర్మూలించడమే లక్ష్యంగా పెట్టుకుంటామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్ సంచలన ప్రకటన చేశారు. ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా జరిపిన దాడిలో సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మృతి చెందిన విషయం తెలిసిందే. ఖమేనీ మృతి చెంది నాలుగు రోజులైనా అమెరికా, ఇజ్రాయెల్ దాడులు ఆపడం లేదు. ఇలాంటి సమయంలో ఇజ్రాయెల్ మంత్రి నుంచి ఈ కీలక ప్రకటన వచ్చింది. ఇజ్రాయెల్‌ను నాశనం చేయాలనుకునే వారిని, అమెరికాను బెదిరించే ప్రయత్నం చేసే వారిని వదిలిపెట్టే ప్రసక్తి లేదని అన్నారు. ఈ ప్రాంతంతో పాటు ప్రపంచ దేశాలను అణిచివేయడానికి, బెదిరించడానికి ఆ దేశ ప్రభుత్వం నియమించిన ఏ నాయకుడినైనా నిస్సందేహంగా అంతం చేస్తామని స్పష్టమైన ప్రకటన చేశారు. సుప్రీం లీడర్‌గా కొత్తగా ఎవరు ఎన్నికైనా, ఎక్కడ దాక్కున్నా వదిలి పెట్టబోమని అన్నారు. అమెరికా భాగస్వామ్యంతో, ఇరాన్ పాలన సామర్థ్యాలను తుడిచిపెట్టేస్తామని హెచ్చరించారు. ఖమేనీ రెండో కుమారుడు ముజ్తబాను దేశ సుప్రీం లీడర్‌గా ఇరాన్ అసెంబ్లీలోని కీలక నేతలు ఎన్నుకున్నట్లు వార్తలు వచ్చాయి. ఇస్లామిక్ రెవెల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్జీసీ)తో బలమైన



## ర్యాపిడో నుంచి ఫుడ్ డెలివరీ యాప్.. 'ఓన్‌లీ'



ద్విచక్ర వాహన రైడింగ్ యాప్ ర్యాపిడో.. ఆహార డెలివరీ సేవల్లోకి అడుగుపెట్టింది. ఇందుకోసం 'ఓన్‌లీ' పేరుతో విడిగా ఓ యాప్‌ను ప్రారంభించింది. రెస్టారెంట్ల నుంచి ఎలాంటి కమీషన్‌ను 'ఓన్‌లీ' వసూలు చేయబోదని కంపెనీ తెలిపింది. అయితే రవాణా వ్యయాల కోసం వినియోగదార్ల నుంచి డెలివరీ రుసుము వసూలు చేస్తామని పేర్కొంది.

ధరలు, ఛార్జీలపరంగా నిజాయతీకి 'ఓన్‌లీ' ప్లాట్‌ఫామ్ ప్రాధాన్యం ఇస్తుందని తెలిపింది. ప్లాట్‌ఫామ్ రుసుము లేదా మెనూ ధరలను పెంచడం లాంటివి ఉండవని, వినియోగదార్లు కేవలం ఆహారం, డెలివరీకి డబ్బులు చెల్లిస్తే సరిపోతుందని వెల్లడించింది. తొలుత ఈ సేవలను బెంగళూరులో అందుబాటులోకి తెచ్చింది.



## డేటా సెంటర్లే లక్ష్యంగా ఇరాన్ దాడులు.. ఇదీ వ్యూహం!

ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడి అనంతరం పశ్చిమాసియా రగులుతోంది. ఇరాన్ కూడా ప్రతి దాడులకు పాల్పడుతోంది. ఇరాన్ ముందు నుంచీ హెచ్చరించినట్లే అమెరికా ఆస్తులే లక్ష్యంగా దాడులకు దిగుతోంది. ఇందులో భాగంగా తాజాగా గల్ఫ్‌లోని అమెజాన్ వెబ్ సర్వీసెస్‌కు (AWS) చెందిన డేటా సెంటర్లే లక్ష్యంగా డ్రోన్లతో విరుచుకుపడింది. దీని వెనుక ఇరాన్ ముందస్తు వ్యూహం ఉందని అర్థమవుతోంది.

సాంకేతిక యుగంలో డేటా ఇంధనంలాంటిది. 'ఇన్ఫర్మేషన్ ఈజ్ వెల్త్' అని ఓ సినిమాలో డైలాగ్ కూడా ఉంది. దీన్ని గ్రహించిన ఇరాన్ గల్ఫ్‌లోని ఏడబ్ల్యూఎస్‌కు చెందిన డేటా సెంటర్లను లక్ష్యంగా చేసుకుంది. తద్వారా అమెరికా వ్యాపార ప్రయోజనాలను దెబ్బతీయాలన్న వ్యూహం కనిపిస్తోంది. ఒకవేళ తమపై అమెరికా దాడి చేస్తే వేటిని లక్ష్యంగా చేసుకోవాలన్నది ఇరాన్ వద్ద ముందు నుంచే స్పష్టమైన ప్రణాళిక ఉందని ఈ దాడులను బట్టి అర్థమవుతోంది. యూఏఈ, బహ్రెయిన్‌లోని తమ డేటా సెంటర్లపై దాడిని అమెజాన్ కూడా ధ్రువీకరించింది. దీంతో తమ కార్యకలాపాల్లో అంతరాయం ఏర్పడిందని పేర్కొంది.

వ్యూహం ఇదేనా?

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ సమాచార నిల్వ, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి సేవలకు డేటా సెంటర్లు కీలకం. వీటి ఏర్పాటుకు పెద్ద మొత్తంలో పెట్టుబడులు అవసరం అవుతాయి. అమెరికాకు చెందిన బిగ్ టెక్ కంపెనీలు ప్రపంచవ్యాప్తంగా వీటిని ఏర్పాటు చేస్తున్నాయి. మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు యూఏఈలో 8 బిలియన్ డాలర్ల పెట్టుబడి ప్రణాళికలను ప్రకటించాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైతం గల్ఫ్‌ను గ్లోబల్ ఏఐ సెంటర్‌గా మారుస్తామని ప్రకటించారు. తాజాగా ఏడబ్ల్యూఎస్‌కు చెందిన డేటా సెంటర్లపై దాడి ద్వారా అమెరికా వ్యాపార ప్రయోజనానలు దెబ్బతీయడం ఇరాన్ లక్ష్యమని అర్థమవుతోంది. ఇరాన్ దాడుల అనంతరం అమెజాన్ షేర్లు ప్రీమార్కెట్ ట్రేడింగ్‌లో దాదాపు 3 శాతం మేర పతనం అయ్యాయి.

యుద్ధ క్షేత్రంలో శత్రువు తప్పించుకునే అవకాశం లేకుండా కచ్చితత్వంతో దెబ్బతీయడంలో ఏఐ కీలక భూమిక పోషిస్తోందని నిపుణులు చెబుతున్నారు. యుద్ధం మొదలైన తొలిరోజే ఖమేనీని హతమార్చడంలో ఏఐ కీలక భూమిక పోషించిందని వార్తలు వస్తున్నాయి. ఇందుకు ఆంత్రోపిక్‌కు చెందిన క్లాడ్ ఏఐని అమెరికా మిలటరీ వాడుకుందని తెలుస్తోంది. యుద్ధ క్షేత్రంలో ఏఐ వినియోగాన్ని దెబ్బతీయాలంటే స్థానికంగా ఉన్న డేటా సెంటర్లను దెబ్బతీయడం ఇరాన్ ముఖ్య ఉద్దేశంగా కనిపిస్తోంది. తద్వారా ముమ్మందు అమెరికా ఇజ్రాయెల్ దళాలను నిలువరించడం సాధ్యమవుతుందనేది ఇరాన్ భావన.

డేటా సెంటర్ల మీద బ్యాంకింగ్, ఈకామర్స్, సోషల్ మీడియా, గేమింగ్, హెల్త్‌కేర్ వంటి సెక్టార్లు ఆధారపడి ఉంటాయి. ఒక్క దెబ్బకు రెండు పిట్టలు అన్న చందంగా డేటా సెంటర్లపై దాడి ద్వారా బహుళ వ్యాపారాలను దెబ్బతీయొచ్చనేది ఇరాన్ వ్యూహం అని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అందుకే డేటా సెంటర్లపై దాడులకు పాల్పడుతోందని, ముమ్మందూ ఈ దాడులు కొనసాగొచ్చని పేర్కొంటున్నారు.

### వార్‌జోన్: సెన్సెక్స్ 1100 పాయింట్లు డౌన్..

# ₹10 లక్షల కోట్లు ఆవిరి!



పశ్చిమాసియాలో యుద్ధ ప్రకంపనలు దలాల్‌స్ట్రీట్‌నూ తాకాయి. ప్రధాన సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీ భారీగా పతనమయ్యాయి. ప్రపంచ ఇంధన సరఫరాకు జీవనాడి అయిన హర్మూజ్ జలసంధి మూసివేత కారణంగా చమురు ధరలు పెరగడం, తాజా ఉద్రిక్తతల కారణంగా ద్రవ్యోల్బణం పెరుగుతుందన్న భయాలు నెలకొన్నాయి. అదే జరిగితే అమెరికా ఫెడ్, ఆర్‌బీఐ ఇప్పట్లో వడ్డీ రేట్లు తగ్గించకపోవచ్చన్న అంచనాలు నెలకొన్నాయి. దీనికి తోడు ఎఫ్ఐఐల అమ్మకాలు, రూపాయి విలువ క్షీణించడం కూడా మన మార్కెట్ పతనాన్ని శాసించాయి. ఓ దశలో సెన్సెక్స్ 1700 పాయింట్లకు పైగా పతనం కాగా.. చివరకి 1100 పాయింట్ల నష్టంతో గట్టెక్కింది. దీంతో మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.10 లక్షల కోట్ల మేర ఆవిరై రూ.456 లక్షల కోట్లకు చేరింది.

సెన్సెక్స్ ఉదయం 78,528.82 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,238.85) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 78,443.20 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 1122.66 పాయింట్ల నష్టంతో 79,116.19 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 385.20 పాయింట్ల నష్టంతో 24,480.50 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 92.16గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో భారతీ ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా మినహా మిగిలిన కంపెనీల షేర్లు నష్టపోయాయ. టాటా స్టీల్, ఎల్అండ్‌టీ, బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్టీపీసీ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 82 డాలర్లకు చేరగా.. బంగారం ఔన్సు 5185 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

కారణాలు ఇవే.. అమెరికా ఇరాన్ వార్

ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయెల్ సంయుక్త ఆపరేషన్ ఐదోరోజుకు చేరింది. తాజాగా టెహ్రాన్, బీరుట్‌లపై దాడులు జరిగాయి. మరో నాలుగైదు వారాల పాటు యుద్ధం కొనసాగవచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. అంతకంటే ఎక్కువ కాలం కొనసాగినా అందుకు సిద్ధమని పేర్కొనడంతో యుద్ధం ఇంకెంత కాలం కొనసాగుతుందోనన్న భయాలు నెలకొన్నాయి.

ముడి చమురు పైకి

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితుల కారణంగా ముడి చమురు ధరలు పెరుగుతున్నాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 82 డాలర్లకు చేరింది. భారత చమురు అవసరాలు 85 శాతం దిగుమతుల వల్లే తీరుతున్నాయి. ఈ నేపథ్యంలో చమురు ధరలు పెరగడంతో కరెంటు ఖాతా లోటు, ద్రవ్యోల్బణం, వృద్ధిపై భయాలు నెలకొన్నాయి.

రూపాయి పతనం

వార్ ఎఫెక్ట్‌తో అంతర్జాతీయ విపణిలో దేశీయ కరెన్సీ రూపాయి క్షీణించి జీవనకాల కనిష్ఠాలకు పడిపోయింది. నేటి సెషన్‌లో 69 పైసలు కోల్పోయి ఏకంగా 92.18 మార్క్ వద్ద కనిష్ఠాన్ని తాకింది. రూపాయి విలువ పతనం వల్ల విదేశీ నిధులు తరలిపోయి కంపెనీల లాభదాయకతపై ప్రభావం పడుతుంది.

**ఎఫ్ఐఐల విక్రయాలు**

**దీనికితోడు దేశీయ స్టాక్ మార్కెట్ నుంచి విదేశీ సంస్థాగత మదుపర్ల విక్రయాలు కొనసాగుతున్నాయి. ఫిబ్రవరి నెలలో నెట్ సెల్లర్లుగా ఉన్న ఎఫ్ఐఐలు.. మార్చి 2న కూడా రూ.3,295 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయించడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది.**

### మెమొరీ చిప్ ధరల పెరుగుదల

# ఆందోళనకరం: శామ్‌సంగ్

శాన్‌ఫ్రాన్సిస్కో: మెమొరీ చిప్ ధరల పెరుగుదల 'అంతర్జాతీయ సమస్య' అని దక్షిణకొరియా ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శామ్‌సంగ్ పేర్కొంది. ఈ సమస్య ఎలక్ట్రానిక్స్/మొబైల్ పరిశ్రమపై ప్రభావం చూపుతోందని, వ్యూహాత్మక భాగస్వామ్యాల ద్వారా సరఫరాలు నిర్వహిస్తామని సంస్థ ధీమా వ్యక్తం చేసింది. మార్కెట్ పరిస్థితులను చాలా జాగ్రత్తగా గమనిస్తున్నామని శామ్‌సంగ్ అధ్యక్షుడు, సీఈఓ (నైరుతి ఆసియా) జేబీ పార్క్ పేర్కొన్నారు. సరఫరా పరంగా మెరుగైన స్థానంలో ఉన్నామని, మార్కెట్ మార్పులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుని, తమ వ్యాపారంపై చిప్ ధరల ప్రభావాన్ని తగ్గించడానికి ప్రయత్నాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

వచ్చే ఏడాది వరకు కొరత: 2027 వరకు మెమొరీ చిప్‌ల కొరత కొనసాగుతుందన్నారు. ఏఐ డేటా కేంద్రాలకు డిమాండ్ విపరీతంగా పెరగడం వల్ల.. శామ్‌సంగ్ సహా పలు అగ్రగామి కంపెనీలు తీవ్రమైన మెమొరీ చిప్‌ల కొరతను ఎదుర్కొంటున్నాయి. ఈ కొరత కారణంగా ఇప్పటికే బడ్జెట్ మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఎల్ఈడీ టీవీలు, ఇతర గృహోపకరణాలపై ధరల భారం పడింది. తయారీదార్లు మెమొరీ చిప్‌ల సరఫరాలను పొందడంలో ఇబ్బంది పడుతుండటంతో పలు విభాగాల్లో ధరల పెరుగుదల, నిల్వల కొరత కనిపిస్తోంది.




# ఎయిర్‌టెల్ పోస్ట్ పెయిడ్ యూజర్లకు ఇక 4జీ కూడా అన్‌లిమిటెడ్

ప్రముఖ టెలికాం సంస్థ బారతీ ఎయిర్‌టెల్ పోస్ట్‌పెయిడ్ కస్టమర్లకు గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రస్తుతం అందిస్తున్న అన్‌లిమిటెడ్ 5జీతో పాటు 4జీ డేటా సేవలను కూడా అపరిమితంగా అందిస్తోంది. ఈ మేరకు వ్యక్తిగత, ఫ్యామిలీ పోస్ట్‌పెయిడ్ ప్లాన్లను అప్‌డేట్ చేసింది. దీనిపై అధికారికంగా కంపెనీ ప్రకటన చేయనప్పటికీ.. వెబ్‌సైట్‌లో ఆ మేరకు మార్పులు చేసింది. తొలుత 10 సర్కిళ్లలో ప్రయోగాత్మకంగా అన్‌లిమిటెడ్ సేవలను ప్రారంబించిన ఎయిర్‌టెల్.. దేశవ్యాప్తంగా అన్ని సర్కిళ్లలో దీన్ని తీసుకొచ్చింది. అపరిమితంగా అంటే 300 జీబీ వరకు హైస్పీడ్ డేటాను యూజర్లు పొందొచ్చు. అప్‌డేట్ చేసిన ప్లాన్ల ప్రకారం.. నెలకు రూ.449 వ్యక్తిగత ప్లాన్ కింద 1 సిమ్ (ప్రైమరీ), అన్‌లిమిటెడ్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్, అన్‌లిమిటెడ్ 4జీ, 5జీ డేటా (300 జీబీ వరకు), ఎయిర్‌టెల్ ఎక్స్‌ట్రీమ్‌ప్లే, జియోహాట్‌స్టార్ (3నెలలు) వంటివి లభిస్తాయి. రూ.549 ప్లాన్‌పై 1 సిమ్, అన్‌లిమిటెడ్ కాల్స్ + ఎస్ఎంఎస్, డేటాతో పాటు అదనంగా డిస్నీ+ హాట్‌స్టార్ (12 నెలలు), అమెజాన్ ప్రైమ్ (6 నెలలు) వంటి ఓటీటీ బెనిఫిట్స్ ఉన్నాయి. రూ.699 ప్లాన్ కింద రెండు సిమ్‌లు (1 ప్రైమరీ+మరొకటి అదనపు సిమ్) లభిస్తాయి. ఇద్దరు వ్యక్తులు అన్‌లిమిటెడ్ 4జీ, 5జీ సేవలను పొందొచ్చు. అన్‌లిమిటెడ్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్, ఓటీటీ బెనిఫిట్స్ కూడా లభిస్తాయి. చిన్న కుటుంబాలకు సరిపోయేలా రూ.999 ప్లాన్ (1+2), రూ.1199, రూ.1399 (1 ప్రైమరీ+ 3 అదనపు సిమ్‌లు) ప్లాన్లను కూడా తీసుకొచ్చింది. ఈ ప్లాన్లతో ఓటీటీ ప్రయోజనాలతో పాటు యాపిల్ టీవీ, యాపిల్ మ్యూజిక్ కూడా లభిస్తుంది. నెలకు రూ.1749తో ఐదుగురికి సరిపోయేలా మరో ప్రీమియం ప్లాన్ కూడా ఇస్తోంది. ఇందులో ఐదు సిమ్‌లు (1ప్రైమరీ+4 అదనపు సిమ్‌లు) వస్తాయి.




# మనదేశానికి మరిన్ని జీసీసీలు!

పశ్చిమాసియాలో తీవ్రమవుతున్న యుద్ధం వల్ల గ్లోబల్ క్యాపబిలిటీ కేంద్రాలు (జీసీసీ), స్వల్పకాలంలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. అయితే అంతర్జాతీయ కంపెనీలు తమ కార్యకలాపాల్లో స్థిరత్వానికి ప్రాధాన్యత ఇస్తుండటంతో, అంతిమంగా జీసీసీల రూపంలోనూ భారత్ ప్రయోజనం పొందొచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం భారత్, పశ్చిమాసియా ప్రాంతాల్లో మైక్రోసాఫ్ట్, వీసా, ఇంటెల్, క్వాల్‌కామ్, సీమెన్స్ హెల్తీనీర్స్, డీహెచ్ఎల్, నోకియా, హెచ్‌పీ, పెప్సికో, ఎమర్సన్, లెనోవో, జాన్సన్ కంట్రోల్స్, ఈటన్ వంటి బహుళజాతి సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. టెక్నాలజీ, సెమీ కండక్టర్లు, లాజిస్టిక్స్, ఆరోగ్య సంరక్షణ, తయారీ, ఆర్థిక సేవలు వంటి రంగాల్లో ఇవి ఉన్నాయి. యుద్ధ తీవ్రత తగ్గాక కూడా, గల్ఫ్ ప్రాంతంలో భద్రతాపరమైన ఆందోళనలు త్వరగా తొలగిపోయే అవకాశం లేదని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ సంస్థలు గల్ఫ్ ప్రాంతంలో తమ విస్తరణ ప్రణాళికలను పునఃసమీక్షించుకునేలా చేయొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. అక్కడ కొత్త పెట్టుబడులపై కంపెనీలు అప్రమత్తంగా వ్యవహరించే అవకాశాలున్నాయి. యుద్ధం దీర్ఘకాలం కొనసాగి, చమురు సరఫరాకు ఆటంకాలు ఏర్పడి, ధరలు పెరిగితే కనుక.. అంతర్జాతీయంగా వాణిజ్య సంస్థలు టెక్నాలజీ వ్యయాలను తగ్గించొచ్చు. అప్పుడు కొత్త జీసీసీల స్థాపనను కంపెనీలు తగ్గించొచ్చు. బహుళజాతి సంస్థలు అనిశ్చితికి దూరంగా ఉండాలనే భావిస్తాయి. అందువల్ల ఉద్రిక్తతల ముప్పు ఉన్న ప్రాంతాల్లో కార్యకలాపాలు తగ్గించుకుని, దానికి బదులుగా స్థిరత్వం అధికంగా ఉన్న మన దేశంలో జీసీసీల విస్తరణను వేగవంతం చేయొచ్చని భావిస్తున్నారు.

గల్ఫ్ ఇంకా ముఖ్యమైన నియర్‌షోర్ బేస్‌గా మారలేదు, కానీ ఆ దిశగా వేగంగా వెళ్తోందని ఇంజినీరింగ్, ఐఓటీ, ఆర్ అండ్ డీ రంగాలను పర్యవేక్షించే ఈఐఐఆర్ ట్రెండ్ సీఈఓ పరీఖ్ జైన్ అన్నారు. యూఏఈ, సౌదీ అరేబియా, ఖతార్ వంటి దేశాలు తమ ఆర్థిక వ్యవస్థలను చమురు ఆధారితంగా కాకుండా.. ఫైనాన్స్, ఏఐ, టెక్నాలజీ, ట్రావెల్, తయారీ వంటి రంగాల్లో విస్తరించడానికి కృషి చేస్తున్నాయి. ప్రస్తుత ఉద్రిక్తతలు ఆ ప్రయత్నాలకు ఆటంకంగా మారొచ్చు.

నిర్ణయాల్లో జాప్యంఅంతర్జాతీయ అనిశ్చితుల కారణంగా మన దేశంలో నెలకొల్పాలనుకున్న జీసీసీ నిర్ణయాలూ ఆలస్యం కావొచ్చు. కంపెనీలు ముందుగా తక్షణ రిస్క్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టడమే ఇందుకు కారణం.ప్రస్తుత పరిస్థితి ఇదిమన దేశంలో 1800కు పైగా జీసీసీలు ఉన్నాయి. ఇవి 19 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. 202324లో 63.6 బి.డాలర్ల (రూ.5.72 లక్షల కోట్ల) ఆదాయాన్ని సృష్టించాయి. 2030కి ఈ రంగం 110 బి.డాలర్ల (రూ.9.9 లక్షల కోట్ల) ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉంది.వృద్ధి అంచనాలుఅంతర్జాతీయ, భారత ఐటీ సేవల రంగ వృద్ధి 202627లో 23 శాతానికి నెమ్మదించొచ్చని ఆన్‌ఎర్త్‌ఇన్‌సైట్ సీఈఓ గౌరవ్ వాసు హెచ్చరించారు. ఇంతకు ముందు వృద్ధి అంచనాలు 45 శాతంగా ఉన్నాయి. రాబోయే 3060 రోజులు అత్యంత కీలకమని టెక్ పాలసీ అనలిస్ట్ సుబిమల్ భట్టాచార్జి స్పష్టం చేశారు. అధిక రిస్క్ ఉన్న ప్రాంతాల్లో కంపెనీలు పెట్టుబడులను తగ్గించి.. భారత్‌వైపు మొగ్గుచూపొచ్చు. తద్వారా భారత జీసీసీ రంగం మరింత బలోపేతం కానుంది. ఉద్రిక్తతలు దీర్ఘకాలం కొనసాగితే మాత్రం కొత్త జీసీసీల ఏర్పాటే నిదానించొచ్చు.



## యశ్ ‘టాక్సిక్’ వాయిదా.. కారణమిదే..



యశ్ (Yash) హీరోగా రానున్న తాజా సినిమా ‘టాక్సిక్’ (Toxic Movie). గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో ఇది రూపొందుతోంది. ‘ఏ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్’ అనేది ఉప శీర్షిక. భారీ స్థాయిలో రూపొందుతోన్న ఈ చిత్రం వాయిదా పడింది. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణ సంస్థ ఓ పోస్ట్ పెట్టింది. మొదట ఈ మూవీని మార్చి 19న విడుదల చేయాలని భావించారు. కానీ, ప్రస్తుతం పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా దీన్ని జూన్ 4కు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

‘మేం ఈ ‘టాక్సిక్’ను అన్ని భాషల్లో విడుదల చేయాలని నిర్ణయించుకున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఇంగ్లిష్‌లోనూ రిలీజ్ చేయాలి. ప్రస్తుతం పశ్చిమాసియాలో పరిస్థితులు అందరికీ తెలిసినవే. ఇలాంటి సమయంలో సినిమాను విడుదల చేయడం సరైన నిర్ణయం కాదు. అందుకే వాయిదా వేస్తున్నాం” అని నిర్మాణ సంస్థ పేర్కొంది. ఇక ఇందులో యశ్‌తో పాటు అయిదుగురు హీరోయిన్లు కీలక పాత్రలు పోషిస్తున్నారు. నదియా పాత్రలో కియారా కనిపించనుండగా హ్యూమా ఖురేషీ (Huma Qureshi) ఎలిజిబెత్‌గా, నయనతార (Nayanthara) గంగ పాత్రలో, రెబెకాగా తారా సుతారియా అలరించనున్నారు. మెలిసా అనే పాత్రలో రుక్మిణి వసంత్ ఆకట్టుకోనున్నారు. ఇటీవల విడుదలైన టీజర్ చర్చనీయాంశమైన విషయం తెలిసిందే.



## కొత్త కోడలొచ్చింది.. బాగా చూసుకోండి: విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ (Vijay Deverakonda) రష్మిక (Rashmika) వెడ్డింగ్ రిసెప్షన్ బుధవారం (మార్చి 4) సాయంత్రం జరగనుంది. మరోవైపు, ఇప్పటికే అభిమానులకు ప్రత్యేక విందు ఇచ్చిన ఈ జోడీ తాజాగా.. తెలుగు మీడియాను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాలకు కొత్త కోడలు వచ్చిందని, మంచిగా చూసుకోండి అంటూ నవ్వులు పూయించారు “మా ప్రయాణంలో మీరు (మీడియా) ఓ భాగం. పెళ్లి చేసుకుని జంటగా ఇప్పుడు మీ ముందుకొచ్చాం. ఇదో విభిన్న అనుభూతి. కాలం గడిచిపోతోంది. మేం పెద్దవాళ్లం అయిపోతున్నాం, కొత్త విషయాలు నేర్చుకుంటున్నాం. కానీ, మిమ్మల్ని మర్చిపోం. మీరు మా హృదయాల్లో ఎప్పటికీ ఉంటారు. మీ ఆశీస్సులు మాకు కావాలి” అని విజయ్ కోరారు. “మేం కలిసి జీవితంలో కొత్త అధ్యాయం మొదలుపెట్టాం.” అని రష్మిక పేర్కొన్నారు.
అభిమానులతోనూ విరోష్ జోడీ తమ వివాహ వేడుకలను సెలబ్రేట్ చేసుకున్న సంగతి తెలిసిందే. మార్చి 1న పలు నగరాల్లో స్వీట్ల పంపిణీ, కొన్ని ఆలయాల్లో అన్నదానం చేసిన ఈ జంట.. మంగళవారం హైదరాబాద్‌లో ఫ్యాన్స్‌కు ప్రత్యేక విందు ఇచ్చింది. సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు, ఇతర రంగాల ప్రముఖులు వీరి రిసెప్షన్‌కు హాజరుకానున్న నేపథ్యంలో భద్రతను పెంచారు.

## అలాంటి వాటికి దూరమే మేలు

మన గురించి తప్పుగా అర్థం చేసుకుంటున్నారని తెలిసినప్పుడు బాధగా అనిపిస్తుందంటోంది కథానాయిక జాన్వీ కపూర్. కొన్నాళ్లుగా ఆమె సోదరుడు అర్జున్ కపూర్ సామాజిక మాధ్యమాల వేదికగా ట్రోల్స్‌కి గురవుతున్న నేపథ్యంలో.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న జాన్వీ దీని గురించి మాట్లాడింది. అలాంటి వేధింపులను క్షమించాల్సిన అవసరం లేదని తెలిపింది.

“సోషల్ మీడియా సంస్కృతి గురించి నేను అర్థం చేసుకున్నదల్లా ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలను పంచుకుంటూ వైరల్ అవ్వాలని కోరుకుంటారు. కాబట్టి వాళ్లు మీ గురించి కంటెంట్ సృష్టిస్తుంటే అందులో మీరు కేవలం బలిపశువు మాత్రమే. వారు మీ పేరు ఉపయోగించుకుని వ్యూస్‌లను పొందాలనుకుంటారు. నిజానికి ఆ వార్తలు చదివాక దానికి మీకు ఏ సంబంధం లేదని కూడా మీకు అర్థం అవుతుంది. అప్పుడు మీరు అలాంటి విషయాలను మనసుకి దగ్గరగా తీసుకోకుండా.. వాటిపై ఎక్కువ సమయం కేటాయించకుండా ఉంటే మంచిది. సోషల్ మీడియాలో మరీ ఈ రకమైన ప్రవర్తనను క్షమించకూడదు. ఇలాంటి నెగిటివిటికీ మిమ్మల్ని మీరు ఎంత దూరంగా ఉంచుకుంటే అంత మేలు”అని పంచుకుంది. జాన్వీ.. రామ్‌చరణ్ సరసన ‘పెద్ది’ చిత్రంతో త్వరలోనే థియేటర్లలో సందడి చేయనుంది.



## నాది రూ.800 కోట్ల వెడ్డింగ్ అని రాశారు ..వరలక్ష్మి శరత్‌కుమార్



వరలక్ష్మి శరత్‌కుమార్ స్వీయ దర్శకత్వంలో రూపొందిన ‘సరస్వతి’. మార్చి 6న ప్రేక్షకుల ముందుకురానుంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో వరలక్ష్మి తన సినిమా గురించి పంచుకున్నారు. సమాజంలో మార్పు కోసం ఈ చిత్రాన్ని తీసినట్లు చెప్పారు.
ఆత్మగౌరవం, అహం.. ఈ రెండింటిలో ఏది ఎంచుకుంటారు?
వరలక్ష్మి: కచ్చితంగా ఆత్మాభిమానాన్ని ఎంచుకుంటాను. దీనికి ఉదాహరణ కూడా చెబుతాను. ఓ మలయాళ సినిమాలో నన్ను తక్కువగా చూసినందుకు నేను దాని నుంచి వైదొలిగాను. ఆ హీరో, దర్శకుడు ఇద్దరూ మంచి వాళ్లే. కానీ, నిర్మాత మూర్ఖుడు. ఆయన నాతో వ్యవహరించిన విధానం నాకు నచ్చలేదు. దీంతో ఆ హీరోకు ఫోన్ చేసి ఈ చిత్రంలో నటించను. వెళ్లిపోతున్నా అని చెప్పి వచ్చేశాను. అది అహం కాదు.. ఆత్మగౌరవం.
సోషల్ మీడియాపై మీ అభిప్రాయం ఏంటి?
వరలక్ష్మి: ఒక్కోసారి కాలక్షేపానికి పనికివస్తుంది. ఒక్కోసారి దాని నుంచి వచ్చే నెగెటివిటీ మనసులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. దానికి ఎక్కువ సమయం కేటాయించకుండా క్రియేటివ్‌గా ఆలోచిస్తూ ఎన్నో కొత్త విషయాలు నేర్చుకుంటే కెరీర్ బాగుంటుంది.
మిమ్మల్ని బాగా ప్రభావితం చేసిన ఒక రూమర్, వార్త చెప్పండి?
వరలక్ష్మి: నేను బాధపడిన రూమర్స్ ఏవీ లేవు. సోషల్ మీడియాలో ఒక వార్త చూసి బాగా నవ్వుకున్నాను. నా పెళ్లికి రూ.800 కోట్లు ఖర్చు అయిందని రాశారు. నా దగ్గర అన్ని డబ్బులు ఉంటే ఇక్కడ ఎందుకు ఉంటాను.
ఇండస్ట్రీలో మీరు రహస్యంగా అభిమానించే వారు ఎవరైనా ఉన్నారా?
వరలక్ష్మి: ఈ విషయంలో రహస్యమేమీ లేదు. ఎంతోమంది నటీనటులను నేను అభిమానిస్తాను. ఇండస్ట్రీలో చాలా గొప్పవాళ్లు ఉన్నారు. ఫహాద్ ఫాజిల్, మంజు వారియర్, అలియా, దీపికా పదుకొణె.. ఇలాంటి వాళ్లు చాలామంది ఉన్నారు.
మీరు సహించలేని విషయం ఏంటి?
వరలక్ష్మి: అగౌరవంగా చూస్తే అసలు తట్టుకోలేను. అది సెట్‌లో, ఇంట్లో ఎక్కడైనా గౌరవం ఇవ్వాల్సిందే. నేను ఎవరితోనైనా నిజాయతీగా ఉంటాను.

ఇప్పటివరకూ మీరు చేసిన సినిమాల్లో మీకు నచ్చిన పాత్ర ఏది?
వరలక్ష్మి: ‘నాంది’లో ఆద్య పాత్ర నాకు చాలా ఇష్టం. నటనపరంగా అది చాలా గొప్ప పాత్ర.

## ఓటీటీకి అనశ్వర రాజన్ హిట్ మూవీ!



అనశ్వర రాజన్ .. మలయాళంలో మంచి క్రేజ్ ఉన్న హీరోయిన్. మలయాళంలో ఆమె చేసిన సినిమాలకి ఓటీటీలోను మంచి ఆదరణ లభించడంతో, తెలుగు వైపు నుంచి కూడా ఆమెను అభిమానించేవారున్నారు. 'ఛాంపియన్' సినిమాతో ఆమె టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చేసింది కూడా. అలాగే కోలీవుడ్ ఎంట్రీని కూడా పూర్తి చేసేసింది. జీవీ ప్రకాశ్ కుమార్ తో ఆమె చేసిన 'లక్కీ సూపర్ స్టార్' రీసెంటుగా ఓటీటీలోకి వచ్చింది. ఇక అభిషన్ జీవింత్ జోడీగా ఆమె చేసిన 'విత్ లవ్' సినిమా ఇప్పుడు ఓటీటీకి రావడానికి రెడీ అవుతోంది. అభిషన్ జీవింత్ పేరు చెప్పగానే గతంలో అతను దర్శకత్వం వహించిన 'టూరిస్ట్ ఫ్యామిలీ' సినిమా గుర్తుకు వస్తుంది. చిన్న సినిమాగా వచ్చి పెద్ద విజయాన్ని అందుకున్న సినిమా అది. అలాంటి అభిషన్ జీవింత్, ఈ సినిమాతో హీరోగా ఎంట్రీ ఇచ్చాడు. అతని సరసన అనశ్వర కథానాయికగా నటించిన ఈ సినిమా, ఫిబ్రవరి 6వ తేదీన థియేటర్లకు వచ్చింది. ఈ సినిమా ఓటీటీ స్ట్రీమింగ్ హక్కులను 'నెట్ ఫ్లిక్స్' వారు సొంతం చేసుకున్నారు. ఈ నెల 6వ తేదీ నుంచి ఈ సినిమాను అందుబాటులోకి తీసుకుని రానున్నారు. మదన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను, సౌందర్య రజనీకాంత్ నిర్మించారు. పెళ్లి చూపులలో భాగంగా మోనీషాను సత్య కలుసుకుంటాడు. గతంలో తాము ఒకే స్కూల్ లో చదువుకున్నామనే విషయాన్ని అప్పుడే వాళ్లు గ్రహిస్తారు. ఆ స్కూల్ కి వెళ్లి పాత ఫ్రెండ్స్ ను కలవాలని అనుకుంటారు. ఆ తరువాత ఏం జరుగుతుంది? అనేది కథ.

## 46 ఏళ్ల తర్వాత కమల్–రజనీ కాంబో.. షూటింగ్‌పై కీలక అప్‌డేట్

భారతీయ సినీ దిగ్గజాలు కమల్ హాసన్, రజనీకాంత్ 46 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ కలిసి నటిస్తున్న చిత్రంపై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. ‘జైలర్’ ఫేం నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా షూటింగ్‌పై ఓ కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రం వచ్చే ఏడాది సెట్స్‌పైకి వెళ్లనుంది. ఈ విషయాన్ని స్వయంగా చిత్ర సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ వెల్లడించారు. ప్రస్తుతం కమల్ హాసన్, రజనీకాంత్ తమ కమిట్‌మెంట్లను పూర్తి చేసుకున్న తర్వాత ఈ ప్రాజెక్టులో చేరతారని తెలుస్తోంది. దీంతో ఈ లెజెండరీ కాంబినేషన్ కోసం ఎదురుచూస్తున్న అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఇదిలా ఉంటే... ఈ సినిమా చిత్రీకరణకు సంబంధించి ఓ ఆసక్తికర ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రాన్ని 80, 90ల కాలంలో ఉపయోగించిన పాత ఫిల్మ్ కెమెరాలతో చిత్రీకరించాలని దర్శకుడు నెల్సన్ భావిస్తున్నారట. నిజానికి ఈ సినిమా ప్రోమోను కూడా అదే పద్ధతిలో తీయాలనుకున్నా, సమయాభావం వల్ల డిజిటల్ పద్ధతిలో పూర్తి చేశారని సమాచారం. ఇటీవల విడుదలైన ఈ సినిమా స్పెషల్ గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. తమదైన స్టైల్‌లో ఇద్దరు లెజెండ్స్ కనిపించడంతో సినిమాపై హైప్ మరింత పెరిగింది. రెడ్ జెయింట్ మూవీస్ నిర్మిస్తున్న ఈ చిత్రంతో నెల్సన్ ఎలాంటి అద్భుతం సృష్టిస్తాడోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




## వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో.. ఎన్‌బీకే 112!



కథానాయకుడు నందమూరి బాలకృష్ణ ఈ వారమే గోపీచంద్ మలినేని సినిమా కోసం రంగంలోకి దిగనున్నారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఇది ఈ ఏడాది చివర్లోనే తెరపైకి వచ్చే అవకాశముంది. అయితే ఈ లోగానే ఆయన తదుపరి సినిమాకి సంబంధించి ఓ ఆసక్తికర వార్త బయటకొచ్చింది. దర్శకుడు వివేక్ ఆత్రేయ చెప్పిన కథకు పచ్చజెండా ఊపినట్లు సమాచారం.
‘సరిపోదా శనివారం’ విజయం తర్వాత వివేక్ పట్టాలెక్కించనున్న చిత్రమిదే. ఇది ఎక్కువ విస్తృతి ఉన్న కథతో ముస్తాబు కానుందని.. బాలయ్య దీంట్లో చాలా కొత్తగా కనిపిస్తారని.. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిసింది. ఇది ‘ఎన్‌బీకే 112’ ప్రాజెక్ట్‌గా ఈ ఏడాది ద్వితీయార్థంలోనే సెట్స్‌పైకి వెళ్లే అవకాశముంది. దీన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించనుంది.

## ఐపీఎల్ 18 సీజన్లు: టాపర్‌లు.. వారి గణాంకాలు ఇవీ!



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (IPL) 19వ సీజన్‌కు రంగం సిద్ధమవుతోంది. త్వరలో కొత్త ఐపీఎల్ ఎడిషన్ స్టార్ట్ అవ్వబోతోంది. టీ20 ప్రపంచకప్ అయిపోయాక ఐపీఎల్ షెడ్యూల్ ప్రకటిస్తారని సమాచారం. ఈ నేపథ్యంలో ఐపీఎల్ మొత్తంలో ప్రతి విభాగంలో టాపర్లు ఎవరు, బెస్ట్ ప్లేయర్లు ఎవరో చూద్దాం!

బౌలింగ్‌లో బెస్ట్ యావరేజీ లుంగి ఎంగిడి పేరున ఉంది. 16 మ్యాచుల్లో 18.24 సగటుతో బౌలింగ్ వేశాడు. ఉత్తమ ఎకానమీ అయితే ముత్తయ్య మురళీధరన్ పేరున ఉంది. 66 మ్యాచుల్లో 6.68 ఎకానమీతో బౌలింగ్ చేశాడు.

అల్జారీ జోసెఫ్ (6/12) పేరిట ఉత్తమ ప్రదర్శన రికార్డు ఉంది. ఇక అత్యధిక డాట్ బాల్స్ వేసిన ఘనత భువనేశ్వర్ కుమార్‌కి దక్కింది. 190 మ్యాచుల్లో 1793 డాట్స్ వేశాడు. అత్యధిక వికెట్ల లిస్ట్‌లో 221 వికెట్లతో యుజ్వేంద్ర చాహల్ టాప్‌లో ఉన్నాడు.

18 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలో ఫాస్టెస్ట్ సెంచరీ కొట్టిన రికార్డు క్రిస్ గేల్‌దే. 30 బంతుల్లో శతకం బాదాడు. ఫాస్టెస్ట్ 50 రికార్డు ఘనత యశస్వి జైస్వాల్‌ది 13 బంతుల్లో అర్ధ శతకం సాధించాడు.

ఐపీఎల్ చరిత్రలో ఎక్కువ ఫోర్లు కొట్టింది విరాట్ కోహ్లీ. 267 మ్యాచుల్లో 771 బౌండరీలు సాధించాడు. సిక్స్‌ల విషయానికొస్తే క్రిస్ గేల్ (357) టాప్‌లో ఉన్నాడు.

ఐపీఎల్‌లో అన్ని ఇన్నింగ్స్‌లు కలిపి అత్యధిక పరుగులు చేసింది విరాట్ కోహ్లీ. ఇప్పటివరకు 267 మ్యాచ్‌లు ఆడిన విరాట్ 8661 పరుగులు సాధించాడు. ఆ తర్వాత స్థానం రోహిత్ శర్మది. 272 మ్యాచుల్లో 7046 పరుగులు చేశాడు.

ఒక మ్యాచ్‌లో అత్యధిక స్కోరు చేసిన బ్యాటర్ క్రిస్ గేల్ (175*). మొత్తం ఐపీఎల్‌లో అత్యధిక స్ట్రయిక్ రేట్‌లో టాప్‌లో ఉన్నది ఫిల్ సాల్ట్ (175.71).

## మాకు స్పిన్నర్లపై గొప్ప రికార్డు లేదు .. హ్యారీ బ్రూక్



ఇంటర్నెట్ డెస్క్: తమ జట్టు ఎక్కువగా డేటా విశ్లేషణపైనే ఆధారపడి ఉందని ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ వ్యాఖ్యానించాడు. టీ20 ప్రపంచ కప్‌లో టీమ్‌ఇండియాతో వాంఖడే వేదికగా సెమీఫైనల్ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ తలపడనుంది. ఈ సందర్భంగా కెప్టెన్ బ్రూక్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడాడు. స్పిన్‌ను ఎదుర్కోవడంలో తమకు గొప్ప రికార్డు లేదని అంగీకరించాడు. తమ వద్ద ఉన్న డేటాతో భారత్‌ను ఇబ్బందిపెట్టేందుకు ప్రయత్నిస్తామని వెల్లడించాడు. ''మా దగ్గర చాలా గణాంకాలు ఉన్నాయి. వీడియోల రూపంలోనూ చాలా స్టఫ్ ఉంది. భారత బ్యాటర్లు ఎక్కడ బంతిని విసిరితే భారీ షాట్లు కొడతారు? ఎలాంటి బౌలింగ్ చేయాలనేదానిపై కసరత్తు చేశాం. టీమ్‌ఇండియా బలమైన టీమ్. కానీ, మా పని మాత్రం వారిని ఇరుకున పెట్టి విజయం సాధించేందుకు ప్రయత్నించడమే. జోస్ బట్లర్ తప్పకుండా మళ్లీ ఫామ్ అందుకొంటాడని భావిస్తున్నాం. ఫిల్ సాల్ట్‌తో కలిసి భారత బౌలింగ్‌పై ఆధిపత్యం ప్రయత్నిస్తాడనే నమ్మకం ఉంది. అయితే, టీమ్‌ఇండియాలో నాణ్యమైన స్పిన్నర్లు ఉన్నారు. వారిని ఎదుర్కొని పరుగులు రాబట్టడం మాకు సవాలే. వరుణ్ చక్రవర్తి ప్రపంచంలోనే నంబర్ వన్ బౌలర్. స్పిన్‌ను ఆడటంలో మాకు మంచి రికార్డు లేదు. వరుణ్ బౌలింగ్‌లో పరుగులు చాలా కష్టం'' అని బ్రూక్ తెలిపాడు.

# ఆరు సెమీఫైనల్స్.. మూడు ఫైనల్స్..

## రెండు టైటిళ్లు.. ఇదీ టీమ్‌ఇండియా ప్రస్థానం!




డిఫెండింగ్ ఛాంపియన్స్‌గా బరిలోకి దిగిన టీమ్‌ఇండియా టీ20 ప్రపంచకప్ 2026కు రెండు అడుగుల దూరంలో ఉంది. గురువారం ఇంగ్లాండ్‌తో జరగనున్న సెమీఫైనల్‌లో గెలిస్తే.. ఫైనల్‌కు చేరుకుంటుంది. తుది పోరులోనూ విజయం సాధిస్తే వరుసగా రెండోసారి.. ఓవరాల్‌గా మూడోసారి కప్ గెలిచి రికార్డ్ సృష్టించే అవకాశం ఉంది. అయితే అది తేలిక కాదు. అందుకోసం టీమ్‌ఇండియా తన సర్వశక్తులూ ఒడ్డాల్సి ఉంటుంది.

గత ప్రపంచకప్పుల్లో భారత్ ప్రదర్శనలు..

2026 టోర్నీతో సహా.. ఇప్పటి వరకు 10 సార్లు పొట్టి ప్రపంచకప్ జరిగింది. మొత్తంగా రెండుసార్లు (2007, 2024) ఈ టోర్నీల్లో భారత్ విజేతగా నిలిచింది. అలాగే ఇప్పటి వరకు ఆరుసార్లు సెమీ ఫైనల్స్‌కు చేరుకుంది. 2022, 2024, 2026లో వరుసగా మూడుసార్లు సెమీస్‌కు చేరుకుంది. 2007, 2014, 2024లో మూడు సార్లు ఫైనల్స్‌కు చేరుకుంది. 2007లో టీమ్‌ఇండియా విజేతగా నిలిచింది. 2014లో ఫైనల్‌లో శ్రీలంక చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచింది. 2016లో సెమీఫైనల్స్‌లో వెస్టిండీస్ చేతిలో ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఈ మూడు సందర్భాల్లోనూ ఎం.ఎస్.ధోనీ సారథి.

2022లో టీమ్‌ఇండియా సెమీఫైనల్స్‌లో ఇంగ్లాండ్ చేతిలో ఓటమి పాలైంది. 2024లో ఫైనల్స్‌లో దక్షిణాఫ్రికా మీద గెలిచి టీమ్‌ఇండియా టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ రెండు సందర్భాల్లో రోహిత్ శర్మ కెప్టెన్‌గా ఉన్నాడు.

ప్రస్తుతం 2026లో సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో టీమ్‌ఇండియా సెమీస్‌కు చేరుకుంది.

రికార్డుల్లో విరాట్ ముద్ర

టీ20 వరల్డ్‌కప్ సెమీఫైనల్స్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్లలో విరాట్ కోహ్లీ ప్రథమ స్థానంలో ఉన్నాడు. అతడు నాలుగు మ్యాచుల్లో 220 పరుగులు చేశాడు

పొట్టి ప్రపంచకప్ నాకౌట్ మ్యాచుల్లో (సెమీఫైనల్స్, ఫైనల్స్) 373 పరుగులు సాధించాడు.

అలాగే టీ20 నాకౌట్ మ్యాచుల్లో విరాట్ కోహ్లీ అత్యధికంగా 5 హాఫ్ సెంచరీలు సాధించాడు

సెమీఫైనల్స్‌లో భారత బ్యాటర్ల అత్యధిక వ్యక్తిగత స్కోర్లు

2016లో వెస్టిండీస్‌తో జరిగిన సెమీఫైనల్స్‌లో విరాట్ కోహ్లీ 47 బంతుల్లో 89* పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు.

2014లో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో విరాట్ 44 బంతుల్లో అజేయంగా 72* రన్స్ చేశాడు.

2007లో ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో యువరాజ్ సింగ్ (Yuvraj Singh) 30 బంతుల్లో 70 పరుగులు సాధించాడు

2024లో ఇంగ్లాండ్‌తో జరిగిన సెమీఫైనల్స్‌లో రోహిత్ శర్మ (Rohit Sharma) 39 బంతుల్లో 57 పరుగులు సాధించాడు. ఈ ఇన్నింగ్స్‌తో అతడు టీ20 ప్రపంచకప్ సెమీ ఫైనల్స్‌లో హాఫ్‌సెంచరీ సాధించిన తొలి కెప్టెన్‌గా నిలిచాడు.

టీ20 నాకౌట్ మ్యాచుల్లో భారత్ తరఫున విరాట్ కోహ్లీ అత్యధికంగా 11 సిక్స్‌లు బాదాడు. తర్వాత రోహిత్ శర్మ 8 సిక్స్‌లు కొట్టాడు.

ఇప్పటి వరకు భారత్, ఇంగ్లాండ్, పాకిస్థాన్ అత్యధికంగా ఆరుసార్లు టీ20 వరల్డ్‌కప్ సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఈ రోజు (బుధవారం) కోల్‌కతాలోని ఈడెన్‌గార్డెన్స్ వేదికగా దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ మధ్య సెమీఫైనల్ 1 మ్యాచ్ జరగనుంది. అలాగే రేపు (గురువారం) ముంబయిలోని వాంఖడే స్టేడియం వేదికగా గురువారం టీమ్‌ఇండియా, ఇంగ్లాండ్ సెమీఫైనల్స్2లో తలపడనున్నాయి. ఈ మ్యాచుల్లో గెలిచిన జట్లు ఫైనల్‌కు చేరుకుంటాయి. ఆదివారం అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియం వేదికగా ఫైనల్ మ్యాచ్ జరగనుంది.

## ఆ ఓటమికి.. ఇంగ్లాండ్‌పై భారత్ ప్రతీకారం తీర్చుకొనేనా?

టీ20 ప్రపంచ కప్ 2026 రెండో సెమీస్‌లో ఇంగ్లాండ్‌తో భారత్ మార్చి 5న తలపడనుంది. ఇప్పటి వరకు ఇరు జట్లూ పొట్టి కప్ పోటీల్లో ఐదుసార్లు తలపడ్డాయి. భారత్ 3, ఇంగ్లాండ్ 2 మ్యాచుల్లో విజయాలు సాధించాయి. అయితే, 2022 టీ20 ప్రపంచ కప్ సెమీస్‌లో భారత్‌కు ఘోర పరాజయం ఎదురైంది. ఆ మ్యాచ్‌లో 169 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లాండ్ 16 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా ఛేదించింది. ఇప్పుడు ఆ ఓటమికి ప్రతీకారం తీర్చుకొనే సమయం వచ్చింది. టీమ్‌ఇండియా కూడా అలాగే ఇంగ్లాండ్‌ను చిత్తు చేస్తేనే అసలైన కిక్ వస్తుంది. మరి అలాంటి 'రివేంజ్' విక్టరీ సాధ్యమవుతుందో లేదో మీ అభిప్రాయాన్ని కింది పోల్‌లో తెలియజేయండి.




# టీ20 వరల్డ్ కప్ వ్యూయర్ షిప్‌లో రికార్డ్ బద్దలు!




ప్రస్తుత పొట్టి ప్రపంచకప్ (ICC Mens T20 World Cup) 2026.. వ్యూయర్‌షిప్ పరంగా రికార్డు సృష్టిస్తోంది. ఇప్పటి వరకు భారత్‌లో దాదాపు 50 కోట్ల మంది వీక్షించినట్లు ఐసీసీ (ICC) ఛైర్మన్ జైషా తెలిపారు. టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఇదే రికార్డని వెల్లడించారు. జియో హాట్ స్టార్‌లో గరిష్ఠంగా 6.05 కోట్ల మంది వీక్షించినట్లు ఆయన పేర్కొన్నారు. రానున్న మ్యాచుల్లోనే ఇదే స్థాయిలో వీక్షణలతో కొత్త రికార్డులు నమోదవుతాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు.

'ప్రస్తుత టీ20 ప్రపంచకప్ 2026ను అత్యంత ప్రేక్షకాదరణ పొందిన ఈవెంట్‌గా మార్చాలనే ఆశయంతో ప్రారంభించాం. భారతదేశంలో ఈ ఈవెంట్‌కు వీక్షకుల సంఖ్య 50 కోట్లను (500 మిలియన్లు) దాటింది. ఇది టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే అత్యధికం. జియో హాట్ స్టార్ వీక్షకుల సంఖ్య 6.05 కోట్లకు (60.5 మిలియన్లు) చేరుకుంది. ఈ రాత్రి నుంచి నాకౌట్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. వీటినీ భారత అభిమానులు వీక్షించి, మరిన్ని రికార్డులు బద్దలు కొట్టాలని ఆశిస్తున్నాం' అని ఆయన పేర్కొన్నారు.

ఈ రోజు (బుధవారం) కోల్‌కతాలోని ఈడెన్‌గార్డెన్స్ వేదికగా దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ మధ్య సెమీఫైనల్ 1 మ్యాచ్ జరగనుంది. అలాగే రేపు (గురువారం) ముంబయిలోని వాంఖడే స్టేడియం వేదికగా గురువారం టీమ్‌ఇండియా (Team India), ఇంగ్లాండ్ సెమీఫైనల్స్2లో తలపడనున్నాయి. ఈ మ్యాచుల్లో గెలిచిన జట్లు ఫైనల్‌కు చేరుకుంటాయి. ఆదివారం అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియం వేదికగా ఫైనల్ మ్యాచ్ జరగనుంది.

## కుమార సంగక్కర ఇంట తీవ్ర విషాదం



శ్రీలంక దిగ్గజ క్రికెటర్ కుమార్ సంగక్కర ఇంట తీవ్ర విషాదం నెలకొంది. అతడి తండ్రి, ప్రముఖ న్యాయవాది ఎస్‌కే సంగక్కర వయోభారంతో నిన్న (మార్చి 3) సాయంత్రం తదిశ్వాస విడిచారు. ఎస్‌కే సంగక్కర మరణవార్త లంక క్రికెట్ సర్కిల్స్‌తో పాటు న్యాయ, రాజకీయ వర్గాలను దిగ్భ్రాంతికి గురి చేసింది. సోషల్‌మీడియా వేదికగా సంతాప సందేశాలు వెల్లువెత్తుతున్నాయి. ఎస్‌కే సంగక్కర అంత్యక్రియలు ఇవాళ సాయంత్రం 6 గంటలకు క్యాండీలోని మహాయావా స్మశానంలో జరగనున్నట్లు కుటుంబ సభ్యులు ప్రకటించారు. ఎస్‌కే సంగక్కరకు భార్య కుమారి, కుమార సంగక్కర సహా మరో ముగ్గురు తోబుట్టువులు (తుషారి, సురంగ, వెమింద్రా) ఉన్నారు.కాగా, కుమార సంగక్కరకు తొలి గురువు తండ్రే. సంగక్కర దిగ్గజ క్రికెటర్‌గా ఎదగడంలో ఎస్‌కే సంగక్కర పాత్ర చాలా కీలకం. ఎస్‌కే సంగక్కర వృత్తిరీత్యా బిజీ న్యాయవాది అయినప్పటికీ.. కొడుకు క్రికెట్ కెరీర్ కోసం సమయం వెచ్చించేవారు. ఈ విషయాన్ని సంగక్కర తన రిటైర్మెంట్ సందర్భంగా ప్రస్తావించాడు. కుమార సంగక్కర ప్రస్తుతం ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీకి హెడ్ కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు.

## అభిషేక్ శర్మ @నంబర్ వన్.. సెమీస్‌లో రాణిస్తేనే ర్యాంకు పదిలం!



టీ20ల్లో ఐసీసీ ర్యాంకులు వచ్చేశాయి. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో టీమ్‌ఇండియా ప్లేయర్లే అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. అయితే, ఈ వారంలో జరగనున్న మ్యాచుల్లో రాణించడం భారత ఆటగాళ్లకు అత్యంత కీలకం. లేకపోతే ర్యాంకింగ్స్‌పై ప్రభావం పడే ప్రమాదం లేకపోలేదు.

టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత డ్యాషింగ్ ఆటగాడు అభిషేక్ శర్మ (874 పాయింట్లు) తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. ఈ ప్రపంచ కప్‌లో అతడి నుంచి కేవలం ఒకే ఒక్క హాఫ్ సెంచరీ మాత్రమే వచ్చింది. మూడు మ్యాచుల్లో డకౌట్ అయిన సంగతి తెలిసిందే. అతడి వెనుకనే పాకిస్థాన్ ఓపెనర్ సహిబ్జాద ఫర్హాన్ (848) కాచుకొని ఉన్నాడు. శ్రీలంకపై సెంచరీతో చెలరేగిన అతడు తన పాయింట్లను భారీగా పెంచుకున్నాడు. ఒక స్థానం మెరుగుపర్చుకుని మూడు నుంచి రెండులోకి వచ్చాడు. ఇంగ్లాండ్ ఆటగాడు ఫిల్ సాల్ట్ (803) మూడు ర్యాంకు పడిపోయాడు. పాతుమ్ నిశాంక (766)ను వెనక్కి నెట్టిన ఇషాన్ కిషన్ (783) నాలుగులోకి దూసుకొచ్చాడు. హైదరాబాదీ కుర్రాడు తిలక్ వర్మ (749) ఆరో ర్యాంక్‌కు చేరాడు. ఇక విండీస్‌పై అజేయంగా 97 పరుగులు చేసి గెలిపించిన సంజు శాంసన్ ఏకంగా 25 స్థానాలు ఎగబాకి 40వ ర్యాంకుకు చేరాడు.

వరుణ్‌దే అగ్రస్థానం..

టీ20 ప్రపంచ కప్‌లో మెరుగైన బౌలింగ్‌తో భారత విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న బౌలర్లలో వరుణ్ చక్రవర్తి, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ ముందున్నారు. ఐసీసీ బౌలింగ్ ర్యాంకుల్లోనూ మెరుగ్గా రాణించారు. వరుణ్ చక్రవర్తి (818) అగ్రస్థానంలోనే కొనసాగుతుండగా.. జస్‌ప్రీత్ బుమ్రా (671) ఎనిమిది నుంచి ఏడో ర్యాంకుకు చేరాడు. అర్ష్‌దీప్ సింగ్ (653) ఏకంగా ఆరు స్థానాలు దూసుకొచ్చి 13వ ర్యాంకును సొంతం చేసుకున్నాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా (328) టాప్ ర్యాంక్‌లో ఉండగా.. భారత స్టార్ హార్దిక్ పాండ్య (284) రెండో స్థానానికి వచ్చాడు. సైమ్ ఆయూబ్ (275) కిందకి దిగజారి మూడో ర్యాంకుకు పరిమితమయ్యాడు. టాప్ 10లో భారత్ తరఫున పాండ్యతోపాటు శివమ్ దూబె (9వ ర్యాంకు) మాత్రమే ఉన్నాడు.